# జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

సంపుటి :12 సంచిక :316 శనివారం 18-7-2026 పేజీలు:8 వెల:3 https://www.epaperjournalistdiary.com/







# కరువుపై కేంద్రానికి లేఖ

**రాష్ట్రానికి ప్రత్యేక బృందాన్ని పంపాలని విజ్ఞప్తి**

- రైతాంగం నీటి సౌకర్యం చూసుకొని పంటలు వేసుకోవాలి
- ధరణి అక్రమాలపై సిట్ విచారణ
- 2020 నుంచి భూ లావాదేవీలపై ఫోరెన్సిక్ దర్యాప్తు
- ఇంజినీరింగ్ పనులకు యూనిఫైడ్ టెండర్ విధానం
- మున్సిపల్ కార్పొరేషన్లలో ట్రాన్స్‌జెండర్లకు చోటు
- జీపీ నిధులు ఇక స్థానిక బ్యాంకుల్లోనే జమ
- కరువు పరిస్థితిపై 20న జిల్లాల వారీగా సమీక్షలు
- సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గ నిర్ణయాలు పలు అంశాలపై సుదీర్ఘ చర్చ



హైదరాబాద్ జూలై 17 జర్నలిస్ట్ డైరీ.
రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావంపై కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. పంటల సాగు వ్యవసాయ అనుబంధ రంగాలపై ప్రభావం, తాగు, సాగునీటి ఇబ్బందులు, ఉపాధి కూలీల పరిస్థితులను ఆ లేఖలో సమగ్రంగా వివరించనున్నారు. ఇక్కడి పరిస్థితుల్ని పరిశీలించి, కరువు తీవ్రతను అంచనా వేసేందుకు తక్షణం రాష్ట్రానికి కేంద్రం నుంచి ప్రత్యేక బృందాన్ని పంపాలని కోరారు. అలాగే రాష్ట్రానికి ఎల్‌నినో కంటింజెన్సీ ప్రణాళికల అమలు కోసం అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందించాలని మంత్రివర్గం కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారంనాడిక్కడి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో మంత్రివర్గ సమావేశం జరిగింది. పలు కీలక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. మంత్రివర్గ నిర్ణయాలను రెవెన్యూ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సహచర మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్, జూపల్లి కృష్ణారావుతో కలిసి మీడియాకు వివరించారు.-మిగతా 2 లో





## తెలంగాణ దేవాదాయ శాఖలో చారిత్రక నియామకాలు

- రవీంద్రభారతిలో 191 మంది మతపరమైన ఉద్యోగులకు నియామక పత్రాల అందజేత
- దేవాలయ సేవ ఉద్యోగం కాదు.. భగవంతుని సేవచేసే పవిత్ర బాధ్యత : మంత్రి కొండా సురేఖ
- ఆధ్యాత్మిక సేవలు, ఉద్యోగుల సంక్షేమం, ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

హైదరాబాద్ జూలై 17 జర్నలిస్ట్ డైరీ.
తెలంగాణ దేవాదాయ శాఖ చరిత్రలో అరుదైన ఘట్టానికి హైదరాబాద్‌లోని రవీంద్రభారతి వేదికైంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, ప్రత్యేక తెలంగాణ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా దేవాదాయ శాఖలో 191 మంది మతపరమైన ఉద్యోగులకు నియామక ఉత్తర్వులు అందజేశారు. అర్చకులు, వేదపండితులు, పరిచారకులు, వాహన పూజ పురోహితులు, అసిస్టెంట్ కుక్కలు, డోలు, సన్నాయి, మృదంగం, శృతి, తాళం తదితర విభాగాలకు చెందిన అభ్యర్థులకు దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ స్వయంగా నియామక పత్రాలు అందజేశారు.
ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, దేవాలయ సేవను ఉద్యోగంగా కాకుండా భగవంతునికి సేవ చేసే పవిత్ర బాధ్యతగా భావించాలని కొత్తగా నియమితులైన ఉద్యోగులకు సూచించారు. భక్తులే భగవత్సేవ అనే భావనతో భక్తులకు మరింత నాణ్యమైన సేవలు అందించాలని పిలుపునిచ్చారు.
రాష్ట్ర ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధి, ఆగమ సంప్రదాయాల పరిరక్షణ, సిబ్బంది సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. 'అర్చకులు, ఇతర ఉద్యోగుల సంక్షేమ నిధి ట్రస్ట్' ద్వారా ఉద్యోగులకు మరింత మెరుగైన సంక్షేమ ప్రయోజనాలు అందిస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రధాన దేవాలయాల్లో ప్రత్యేక సందర్భాల్లో

-మిగతా 2 లో




## వందేమాతరం గేయానికి ఇక చట్టబద్ధ రక్షణ

**గేయాన్ని అవమానిస్తే మూడేళ్ల వరకు జైలు శిక్ష**

- జాతీయ గీతంతో సమానంగా ప్రత్యేక గుర్తింపు
- పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో బిల్లు ప్రవేశానికి కసరత్తు
- ఉద్దేశపూర్వక అడ్డుతగిలితే తీవ్రమైన నేరం
- 1971 నాటి చట్టం పరిధిని విస్తరించనున్న కేంద్రం
- చట్టరూపం దాల్చితే చారిత్రక ఘట్టం

న్యూఢిల్లీ జూలై 17 జర్నలిస్ట్ డైరీ.
భారత స్వాతంత్ర్య సమరంలో కోట్లాది మందిలో దేశభక్తిని రగిలించిన అమర గేయం 'వందేమాతరం'కు ఇకపై చట్టబద్ధమైన గట్టి రక్షణ లభించనుంది. భారత జాతీయ గీతమైన 'జనగణమన'కు ప్రస్తుతం చట్టపరంగా ఉన్న గౌరవ మర్యాదలు, రక్షణలన్నింటినీ వందేమాతరం గేయానికి కూడా వర్తింపజేయడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఇందులో భాగంగా 1971 నాటి 'జాతీయ గౌరవ అవమానాల నిరోధక చట్టం'కు కీలక సవరణలు చేసే ప్రతిపాదనకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ సవరణ ప్రకారం.. ఎవరైనా ఉద్దేశపూర్వకంగా వందేమాతరం గేయాన్ని అవమానించినా లేదా దాన్ని ఆలపించేటప్పుడు అడ్డుతగిలి అలజడి సృష్టించినా అది తీవ్రమైన నేరంగా పరిగణించబడుతుంది.

-మిగతా 2లో




## గుజరాత్‌లో భారీ ఉగ్రకుట్ర భగ్నం

- ఐదుగురు జైషే ఉగ్రవాదుల అరెస్ట్
- ఏటీఎస్ అదుపులో జైషే ముష్కరులు
- జులై 24 వరకు ఏటీఎస్ కస్టడీ
- క్రూడ్ ఐఈడీ బాంబు తయారీకి యత్నం
- ఉపా చట్టం కింద కేసులు
- పాక్ ఉగ్ర నెట్‌వర్క్ గుట్టురట్టు
- విచారణలో బయటపడిన కీలక వివరాలు

న్యూఢిల్లీ జూలై 17 జర్నలిస్ట్ డైరీ.
పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న ఉగ్రసంస్థ జైషే మహమ్మద్‌కి చెందిన ఐదుగురు ముష్కరులను గుజరాత్ ఏటీఎస్ అధికారులు అరెస్టు చేశారు. పటన్ జిల్లా సిద్ధ్‌పూర్ తాలూకా ఖడియాల్ గ్రామంలో వీరిని అదుపులోకి తీసుకున్నారు. వీరిని బిలాల్ అబ్దుల్లా షే, మహమ్మద్ ఆయాజ్ కడివాలా, మహమ్మద్ షాన్‌పురి, షఫియా రయిస్ ముక్తి, మహమ్మద్ హసన్ క్రియాగా గుర్తించారు. నిందితులను మెహసానా జిల్లాలోని జ్యుడిషియల్ మెజిస్ట్రేట్

-మిగతా 2 లో

## భారత్‌లో త్వరలో ప్లాస్టిక్ కరెన్సీ




- ఆర్‌బీఐ కీలక సన్నాహాలు
- తొలి దశలో రూ.10, రూ.20 పాలిమర్ నోట్లు
- ప్రయోగాత్మకంగా పైలట్ ప్రాజెక్టు ప్రారంభం
- 2027 నాటికి పూర్తి స్థాయిలో అందుబాటులోకి?
- పాత నోట్లతో పాటే పాలిమర్ కరెన్సీ వినియోగం

న్యూఢిల్లీ,
ప్లాస్టిక్ కరెన్సీని భారత్‌లో ప్రవేశపెట్టేందుకు ఆర్‌బీఐ సన్నాహాలు చేస్తున్నది. పైలట్ ప్రాజెక్టులో భాగంగా రూ. 20, రూ. 10 లాంటి తక్కువ విలువ కలిగిన నోట్లను తొలి దశలో ప్రవేశపెడుతుంది. వీటిని ప్రయోగాత్మకంగా పరిశీలించి, అది పూర్తిగా విజయవంతమైతే తర్వాత పెద్ద నోట్లు విడుదలపై నిర్ణయం తీసుకుంటుంది. -మిగతా 2లో

## నేడే నింగిలోకి విక్రమ్-1

- ప్రయోగించనున్న హైదరాబాద్ అంకుర సంస్థ స్కైరూట్ ఏరోస్పేస్
- దేశంలోనే తొలి ప్రైవేట్ ఆర్బిటల్ రాకెట్ అభివృద్ధి
- 350 కిలోల బరువు గల ఉపగ్రహాలను మోసుకెళ్లే సామర్థ్యం



2లో



## ఫీఫా వరల్డ్ కప్ ఫైనల్ సందర్భంగా బార్ల సమయం పొడిగింపు

- ఫీఫా వరల్డ్ కప్ ఫైనల్ సందర్భంగా హైదరాబాద్‌లో బార్ల వేళా పొడిగింపు
- ఫైనల్ మ్యాచ్ రోజు తెల్లవారుజాము 3 గంటల వరకు మద్యం సరఫరాకు అనుమతి
- మూడో స్థానం మ్యాచ్ కోసం తెల్లవారుజాము 4:30 గంటల వరకు పర్మిషన్
- ఫుట్‌బాల్ అభిమానుల విజ్ఞప్తి మేరకు తెలంగాణ ప్రభుత్వ నిర్ణయం

హైదరాబాద్ జూలై 17 జర్నలిస్ట్ డైరీ.
బార్ అండ్ రెస్టారెంట్స్ ఓనర్స్ అసోసియేషన్ అభ్యర్థనకు ఆమోదం ఫీఫా ప్రపంచ కప్ 2026 తుది అంకానికి చేరుకున్న నేపథ్యంలో, హైదరాబాద్‌లోని ఫుట్‌బాల్ అభిమానులకు తెలంగాణ ప్రభుత్వం తీపి కబురు అందించింది. ప్రపంచ కప్ ఫైనల్ పోరుతో పాటు మూడో స్థానం కోసం జరిగే మ్యాచ్‌ల దృష్ట్యా, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని బార్లు, క్లబ్బులు, మైక్రో బ్రూవరీలను నిర్ణీత సమయం కంటే అదనంగా తెరిచి ఉంచేందుకు అనుమతినిచ్చింది. రాష్ట్ర ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ శుక్రవారం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం, జూలై 18 రాత్రి మూడో స్థానం కోసం జరిగే మ్యాచ్ సందర్భంగా తెల్లవారుజామున 4:30 గంటల వరకు మద్యం సరఫరాకు వెసులుబాటు కల్పించారు. అలాగే, జూలై 19న అర్జెంటీనా, స్పెయిన్ జట్ల మధ్య రాత్రి జరగనున్న ఫైనల్ మ్యాచ్ కోసం తెల్లవారుజామున 3 గంటల వరకు బార్లను తెరిచి ఉంచేందుకు అనుమతించారు. ఫీఫా ప్రపంచకప్ మ్యాచ్‌లు భారత కాలమానం ప్రకారం అర్ధరాత్రి లేదా ఆ తర్వాత ప్రారంభమవుతుండటంతో అభిమానులు తమ ఇళ్లకే పరిమితం కావాల్సి -మిగతా 2 లో



## యూరప్‌లో వేడిగాలులతో 12,000 మంది మృతి..!

- 85% మరణాలు వృద్ధులే
- మరింత పెరగనున్న మరణాలు
- హెచ్చరిస్తున్న నిపుణులు

2లో



## అమెరికా గుట్టు.. చైనా చేతికి !

- 22 కోట్ల అమెరికా ప్రజల డేటా డ్రాగన్ గుప్పిట్లో
- చైనాపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంచలన ఆరోపణలు
- అమెరికా ఎన్నికల వ్యవస్థలోకి జోక్యానికి డ్రాగన్ ప్రయత్నం
- ఇంటెలిజెన్స్ నివేదికలు డిక్లాసిఫై చేసినట్లు వెల్లడి

2లో

# ఉద్యోగులకు ఆరోగ్య భరోసా

**ఉద్యోగుల నూతన ఆరోగ్య పథకం ప్రారంభం**

హైదరాబాద్ జూలై 17 జర్నలిస్ట్ డైరీ.
రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు భరోసా, నమ్మకం కలిగిస్తూ, ఎలాంటి భయాందోళనలు లేని ఆరోగ్య భద్రతా వ్యవస్థను అందించాలనే సదుద్దేశంతో ప్రజా ప్రభుత్వం ఉద్యోగుల నూతన ఆరోగ్య పథకాన్ని ప్రవేశపెట్టిందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు అనారోగ్యానికి గురైతే వైద్య ఖర్చుల కోసం అప్పులపాలై, వాటిని తీర్చలేక సతమతమవుతున్న దుస్థితిని గమనించామని చెప్పారు. ఈ పరిస్థితిని మార్చి, వారికి సంపూర్ణ నగదు రహిత వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ఇందిరమ్మ ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. శుక్రవారం డాక్టర్ -మిగతా 2లో

- 29.80 లక్షల మంది కుటుంబ సభ్యులకు వర్తింపు
- 886 ప్రయివేటు ఆస్పత్రుల్లో నగదు రహిత వైద్యం
- సీజీహెచ్ఎస్ ప్యాకేజీల కింద 1,816 రకాల చికిత్సలు :ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- ఇది మైలురాయి : దామోదర రాజనర్సింహ
- జేఏసీ నేతలకు డిజిటల్‌ఆరోగ్య కార్డుల అందజేత



## తెలంగాణ దేవాదాయ శాఖలో చారిత్రక నియామకాలు

మొదటి తరువాయి

ఆధ్యాత్మిక, ధార్మిక, పురాణ ప్రవచనాలు నిర్వహించేలా త్వరలో ఉత్తర్వులు జారీ చేస్తామని, దేవాలయాల్లో అన్ని విభాగాల ఉద్యోగులకు పనితీరు ఆధారంగా అవార్డులు అందజేస్తామని మంత్రి ప్రకటించారు. ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రధాన దేవాలయాల్లో వరుణయాగాలు నిర్వహించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, డైరెక్టర్ హనుమంతరావు, ధార్మిక సలహాదారు గోవింద హరి, సీటా డైరెక్టర్ విజయ రాఘవాచార్యులు, దేవాదాయ శాఖ అధికారులు, అర్చక ఉద్యోగ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. కొత్తగా నియామక పత్రాలు అందుకున్న పలువురు అభ్యర్థులు తమ చిరకాల కల నెరవేరిందంటూ భావోద్వేగానికి గురయ్యారు.

## వందేమాతరం గేయానికి ఇక చట్టబద్ధ రక్షణ

మొదటి తరువాయి

పార్లమెంట్ వేదికగా చారిత్రక అడుగు

రానున్న జూలై 20 నుంచి ప్రారంభం కాబోతున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ఈ సరికొత్త సవరణ బిల్లును ప్రవేశపెట్టేందుకు కేంద్రం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఈ బిల్లు గనుక ఉభయ సభల ఆమోదం పొంది చట్టంగా మారితే, భారత న్యాయ చరిత్రలో వందేమాతరం గేయానికి ప్రత్యక్ష చట్టబద్ధమైన రక్షణ లభించడం ఇదే తొలిసారి అవుతుంది. ప్రస్తుతం అమలులో ఉన్న 1971 నాటి చట్టం కేవలం భారత జాతీయ పతాకం, భారత రాజ్యాంగం, జాతీయ గీతం (జనగణమన)లకు మాత్రమే చట్టపరమైన రక్షణ కల్పిస్తోంది. ఇప్పుడు ఆ పరిధిని మరింత విస్తృతం చేస్తూ వందేమాతరాన్ని కూడా ఇందులో చేర్చనున్నారు.

ప్రస్తుతం ఉన్న చట్టం ప్రకారం.. ఎవరైనా జాతీయ గీతాన్ని ఆలపించకుండా అడ్డుకున్నా, పాడే సమయంలో కావాలని గందరగోళం సృష్టించినా మూడేళ్ల వరకు జైలు శిక్ష లేదా జరిమానా, లేదంటే ఈ రెండూ విధించే అవకాశం ఉంది. ఇప్పుడు తీసుకురాబోతున్న కొత్త సవరణ ద్వారా ఇదే శిక్షా నిబంధనలను వందేమాతరం గేయానికి కూడా వర్తింపజేయనున్నారు. అయితే ఈ ప్రతిపాదన చట్టరూపం దాల్చాలంటే ముందుగా పార్లమెంట్లోని లోక్‌సభ, రాజ్యసభలలో సుదీర్ఘ చర్చలు జరిగి, ఆమోదం పొందిన తర్వాత రాష్ట్రపతి సంతకం కావాల్సి ఉంటుంది.

రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్న నిర్ణయం

గతంలో 'సెక్యులరిజం' పేరుతో పాలించిన ప్రభుత్వాలు వందేమాతరం గేయానికి ఇవ్వాల్సిన అసలైన గుర్తింపును ఇవ్వడంలో పూర్తిగా విఫలమయ్యాయని బీజేపీ దీర్ఘకాలంగా వాదిస్తోంది. భారత స్వాతంత్ర్య పోరాటంతో ఈ గేయానికి ఎంతో చారిత్రక అనుబంధం ఉన్నప్పటికీ, కొన్ని వర్గాల నుంచి వచ్చిన అభ్యంతరాల కారణంగా గత పాలకులు దీనికి తగిన ప్రాధాన్యం ఇవ్వలేదని ప్రస్తుత పాలక వర్గం భావిస్తోంది. ఇటీవలి కాలంలో కొన్ని ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలలో, కొన్ని ప్రత్యేక వర్గాల కార్యక్రమాల్లో వందేమాతరం గేయానికి ఆశించిన స్థాయిలో గౌరవం దక్కలేదనే ఆరోపణలు కూడా వచ్చాయి. ఈ నేపథ్యంలో కేంద్రం తీసుకురాబోతున్న ఈ బిల్లులో 'అవమానం' అనే పదాన్ని ఏ విధంగా నిర్వచిస్తారనే అంశంపై ఇప్పుడు దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది.

## గుజరాత్‌లో భారీ ఉగ్రకుట్ర భగ్నం

మొదటి తరువాయి

ఆర్.ఎం భటియా ముందు గుజరాత్ ఏటీఎస్ అధికారులు హాజరుపరిచారు. ఈ ఐదుగురిని జులై 24 వరకు గుజరాత్ ఏటీఎస్ కస్టడీకి ఆర్.ఎం భటియా అప్పగించారు.

నిందితులపై ఉపా చట్టం కింద కేసు నమోదు:

గుజరాత్‌లో ఉగ్ర నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసేందుకు యత్నిస్తున్న జులై 3న ఏటీఎస్ టీమ్ 8 మంది ఉగ్రవాదులు చిక్కారు. ఆ ఎనిమిది మంది ముష్కరులను విచారించగా ఈ ఐదుగురి పేర్లు బయటకొచ్చాయి. నిందితుల్లో ఒకరు క్రూడ్ ఐఈడీ బాంబును తయారు చేసి, దానిని పరీక్షించేందుకు ప్రయత్నిస్తున్నట్లు గుజరాత్ ఏటీఎస్ అధికారులు తెలిపారు. ముందస్తుగా అరెస్ట్ అయిన ఎనిమిది మందిలోని ఒకరు ముష్కరుడు ఈ బాంబు తయారీ సామగ్రి అందించినట్లు గుర్తించామని వెల్లడించారు. జైషే మహమ్మద్ తన ఉగ్ర కార్యకలాపాలను మరింతగా వ్యాప్తి చేయడానికి గుజరాత్‌లో ఒక క్రియేటివ్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసేందుకు నిందితులు పనిచేస్తున్నారని పేర్కొన్నారు. నిందితులపై చట్టవిరుద్ధ కార్యకలాపాల నివారణ చట్టం (ఉపా)లోని సెక్షన్ 13, 17, 18, 38, 39, భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్ 148, 61 కింద కేసు నమోదు చేశామని స్పష్టం చేశారు.

అరెస్ట్ అయిన ఐదుగురిలో ఒకరు బాంబు తయారు చేయడానికి ప్రయత్నించారని పబ్లిక్ ప్రాసిక్యూటర్ పీఆర్ దంకాని కోర్టుకు తెలిపారు. అందుకే నిందితులను కస్టడీలోకి తీసుకుని విచారించాలని ఏటీఎస్ కోరుతుందని చెప్పారు. బాంబు తయారీ సామగ్రి, ఉర్దూ భాషలో ఉన్న జైషే మహమ్మద్ ప్రచార సాహిత్యాన్ని సంబంధించిన పుస్తకాలను ఇంకా స్వాధీనం చేసుకోవాల్సి ఉందని అన్నారు. నిందితులు ఒక సాదా రం ఐఈడీ బాంబును పరీక్షించడానికి ప్రయత్నించారని, అయి తే ఆ ప్రయత్నం విఫలమైందని వెల్లడించారు. వారు బాంబు తయారీ సామగ్రి ఎక్కడ సేకరించారు? దానిని ఎక్కడ దాచి పెట్టారు? జైషే మహమ్మద్ ప్రచార సాహిత్యానికి సంబంధించి పుస్తకాలను నిందితులు ఎలా పొందారు? అనే అంశాలపై ఏటీఎస్ దర్యాప్తు చేస్తోందన్నారు. "గుజరాత్ ఏటీఎస్ దర్యాప్తులో ఐదుగురి పేర్లు బయటకొచ్చాయి. నిందితుల్లో ఒక టీమ్ బాంబును తయారు చేయడానికి ప్రయత్నిం చినట్లు తేలింది. అతడి వద్ద జైషే మహమ్మద్ ప్రచార సాహితికి సంబంధించి పుస్తకాలు ఉన్నాయి. దాని సాయం చేసుకొని ఉంది. అంతకుముందు అరెస్ట్ అయిన ఎనిమిది మందిలో ఒకరైన అమీన్ అనే వ్యక్తి, గత అరెస్ట్ అయిన నిందితులకు బాంబు తయారీ సామగ్రి సరఫరా చేశాడు" అని పబ్లిక్ ప్రాసిక్యూటర్ పీఆర్ దంకాని పేర్కొన్నారు.

## భారత్‌లో త్వరలో ప్లాస్టిక్ కరెన్సీ

మొదటి తరువాయి




2027 నుంచి పూర్తి స్థాయిలో ఈ పాలిమర్ నోట్లను ప్రవేశపెట్టాలని ఆర్‌బీఐ యోచిస్తున్నట్టు అధికార వర్గాలు తెలిపాయి. ఈ కొత్త పాలిమర్ నోట్లతో పాటు పేపర్‌తో తయారు చేసిన కరెన్సీ నోట్లు కూడా అందుబాటులో ఉంటా యి. పాత నోట్ల స్థానాన్ని కొత్త నోట్లు భర్తీ చేయవని, రెండూ ఉనికిలో ఉంటాయని ఆర్‌బీఐ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ప్రస్తుతం కాగితంతో తయారవుతున్న సంప్రదాయ కరెన్సీ నోట్ల కన్నా ఈ పాలిమర్ నోట్లు పటిష్టంగా ఉంటాయి.

# కరువుపై కేంద్రానికి లేఖ

మొదటి తరువాయి

ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో దాదాపు 40 శాతం వర్షపాతం లోటు ఉందని చెప్పారు. తొలి ప్రాధాన్యత తాగునీరు, విద్యుత్‌కు ఇస్తామన్నారు. సాగునీరు, వ్యవసాయం, ఇతర అవసరాల కోసం ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది.

కమిటీల ఏర్పాటు

కరువు పరిస్థితి అంచనాల కోసం ఉమ్మడి పదిజిల్లాల ప్రాతిపదికగా రాష్ట్ర ప్రణాళిక మండలి వైస్ ఛైర్మెన్ జీ చిన్నారెడ్డి నేతృత్వంలో వ్యవసాయ నిపుణులు, అధికారులు, శాస్త్రవేత్తలతో కలిసి ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితులకు అనుకూలమైన పంటలు, రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పంటలతో పాటు పశువుల సంరక్షణకు చేపట్టాల్సిన చర్యలతో నివేదిక అందించాలని కోరింది. రానున్న రోజుల్లో పరిస్థితులు మరింత ఇబ్బందికరంగా మారే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరికలు ఉన్నందున, అన్ని శాఖలు ముందస్తు చర్యలకు సిద్ధంగా ఉండాలని సూచించారు. రాష్ట్రంలో ఎక్కడా తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని, తగిన చర్యలు తీసుకోవాలని, ప్రజలు చేసే ఫిర్యాదులకు వెంటనే స్పందించాలని మంత్రివర్గం ఆరుతడి పంటలు సాగుచేయండి ఎక్కువ నీరు అవసరమయ్యే పంటల సాగును రైతులు నివారించి, తక్కువ నీటితో సాగయ్యే ఆరుతడి పంటలను సాగు చేయాలని రైతులకు రాష్ట్ర మంత్రివర్గం విజ్ఞప్తి చేసింది. ఎల్‌నినో ప్రభావంపై రాష్ట్రవ్యాప్తంగా అవగాహన సదస్సులు, సమావేశాలు నిర్వహించాలని, వర్షాభావ పరిస్థితులు, అందుబాటులో ఉన్న నీటి వనరులు, రైతులు పాటించాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు విస్తృతంగా తెలియజేసేలా చర్యలు తీసుకోవాలని మంత్రివర్గం సూచించింది. దానిలో భాగంగా ఈ నెల 20వ తేదీ ఉమ్మడి జిల్లాల వారీగా జిల్లా మంత్రుల ఆధ్వర్యంలో అక్కడి ప్రజా ప్రతినిధులు, అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించింది. ప్రతి జిల్లా ఇన్ ఛార్జీ మంత్రితో పాటు ఒక్కో సీనియర్ ఐఏఎస్ అధికారికి ఈ బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించారు.

ధరణి అక్రమాలపై 'సిట్' ఏర్పాటు

భూముల రికార్డులు, భూముల క్రయ విక్రయాలకు సంబంధించి ధరణి పోర్టల్ ద్వారా జరిగిన అక్రమాలు, అవకతవకలపై సమగ్ర విచారణకు ప్రత్యేక విచారణ బృందం (సిట్) ఏర్పాటు చేసేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ధరణి పోర్టల్ అమల్లోకి వచ్చిన 2020 అక్టోబర్ 29 నుంచి రాష్ట్రంలో జరిగిన భూముల రిజిస్ట్రేషన్లు, రికార్డుల మార్పులు, వ్యవసాయ భూములు, అసైన్డ్ భూములు, ప్రభుత్వ భూముల బదలాయింపులు సహా అన్ని అనుమానాస్పద లావాదేవీలను 'సిట్' లోతుగా పరిశీలించాలని మంత్రివర్గం పేర్కొంది. ఇప్పటికే చేపట్టిన ఫోరెన్సిక్ ఆడిట్‌లో దాదాపు 10 వేలకుపైగా అనుమానాస్పద లావాదేవీలున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. భూముల లావాదేవీలకు సంబంధించిన డిజిటల్ రికార్డులు, లాగిన్ వివరాలు, రికార్డుల్లో చేసిన మార్పులు, అధికారుల అనుమతులు, భూముల వర్గీకరణ మార్పులు, లబ్ధిదారుల వివరాలను సమగ్రంగా పరిశీలించాలని సిట్‌కు దిశానిర్దేశం చేసింది. ధరణి పోర్టల్ నిర్వహణ బాధ్యతలు చేపట్టిన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లీజింగ్ అండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ పాత్రతో పాటు, పోర్టల్ నిర్వహణ సంస్థ ఎంపిక, టెండర్ ప్రక్రియ, వెండర్‌కు కాంట్రాక్టు కేటాయింపు, పోర్టల్ రూపకల్పన, సిస్టమ్ ఆర్కిటెక్చర్, డేటా భద్రతలో ఉన్న లోపాలపై విచారణ జరపాలని క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది.

టెండర్ల కోసం యూనిఫైడ్ విధానం

ప్రభుత్వం చేపట్టే ఇంజినీరింగ్ పనుల్లో పరిపాలన అనుమతులతో పోలిస్తే అంచనాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని మంత్రివర్గం ఆందోళన వ్యక్తం చేసింది. అంచనా వ్యయానికి, చేస్తున్న ఖర్చుకు మధ్య పొంతన కుదరటం లేదనీ, ఫలితంగా సకాలంలో పనులు పూర్తి కావట్లేదనీ, మంజూరైన అంచనాలు, సవరించిన అంచనాల వల్ల ప్రభుత్వంపై ఆర్థిక భారం పెరిగిపోతున్నదని అభిప్రాయపడింది. అందుకే పనుల అప్రైజల్ నుంచి ప్రాజెక్టు ప్రపోజల్, భూసేకరణ, టెండర్లు, బిల్లుల చెల్లింపు విధివిధానాలన్నింటికీ ఒక యూనిఫైడ్ విధానాన్ని రూపొం దించాలని క్యాబినెట్ నిర్ణయించింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్వర్యంలో వీటన్నింటి సమగ్ర సమీక్షకు ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రాజెక్టుల రూపకల్పన, భూసేకరణ, ల్యాండ్ అసెంబ్లీ, కొనుగోళ్లు, కాంట్రాక్టు నిర్వహణ వరకు అన్ని దశలను పరిశీలించేలా నిర్దిష్ట విధివిధానాలపై ఈ కమిటీ పరిశీలన చేసి, నివేదిక ఇవ్వాలని కోరారు.

## ఉద్యోగులకు ఆరోగ్య భరోసా

మొదటి తరువాయి

బిఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మాతో కలిసి ఉద్యోగుల నూతన ఆరోగ్య పథకాన్ని భట్టి విక్రమార్క ప్రారంభించారు. ఉద్యోగ జేఏసీ నేతలకు డిజిటల్ ఆరోగ్య కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ ఉద్యోగుల పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి ఈ పథకమే నిదర్శనమని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం మానవీయ కోణంతో ఆలోచించి ఈ నిర్ణయం తీసుకుందని అన్నారు. ఉద్యోగులు కూడా ప్రభుత్వ కుటుంబ సభ్యులేననీ, వారి సంక్షేమం, ఆరోగ్య భద్రతను చూడాల్సిన బాధ్యత తమపై ఉందని చెప్పారు. సుమారు ఎనిమిది లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లతోపాటు వారిపై ఆధారపడిన 29.80 లక్షల మంది కుటుంబ సభ్యులకు ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరుతుందని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 886 ప్రయివేట్ నెట్‌వర్క్ ఆస్పత్రుల ద్వారా ఉద్యోగులు ఒక్క రూపాయి కూడా చెల్లించకుండా నగదు రహిత వైద్య సేవలు పొందవచ్చన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం (సీజీహెచ్ఎస్) ప్యాకేజీ రేట్లకు అనుగుణంగా 1,816 రకాల వైద్య, శస్త్రచికిత్సలను ఈ పథకం కవర్ చేస్తుందని చెప్పారు. ఈ పథకం పారదర్శకంగా, సజావుగా సాగేందుకు ప్రభుత్వ అధికారులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో సమాన భాగస్వామ్యంతో ఉద్యోగుల ఆరోగ్య పథకం 'ట్రస్ట్'ను ఏర్పాటు చేశామని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగులు ఆరోగ్య భద్రత కోసం సకల జనుల సమ్మెతో సహా ఎన్నో పోరాటాలు చేసినా ఫలితం శూన్యమని విమర్శించారు. పదేండ్లపాటు ఉద్యోగుల విజ్ఞప్తులను బుట్టదాఖలు చేసిందన్నారు. గత ప్రభుత్వం బకాయి పెట్టిన దాదాపు రూ.10 వేల కోట్ల పెండింగ్ బిల్లులను తమ ప్రభుత్వం మానవీయ కోణంలో మంజూరు చేస్తోందని చెప్పారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.ఐదు లక్షల నుంచి రూ.పది లక్షలకు పెంచామని అన్నారు. అర్హులైన 1.06 కోట్ల కుటుంబాలకు కార్పొరేట్ వైద్యాన్ని ఉచితంగా అందిస్తున్నామని గుర్తుచేశారు.

## యూరప్‌లో వేడిగాలులతో 12,000 మంది మృతి..!

-85% మరణాలు వృద్ధులే
- మరింత పెరగనున్న మరణాలు
-హెచ్చరిస్తున్న నిపుణులు

న్యూఢిల్లీ



శీతల ఖండం యూరప్‌లో వేడిగాలులు ప్రజల్లో వణుకు పుట్టిస్తున్నాయి. పలు దేశాలు హీట్ డోమ్ వల్ల ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. ప్రచండ వేడి గాలులను తట్టుకోలేక ప్రజలు అల్లాడిపోతు న్నారు. అనేక దేశాలలో ప్రమాదకర స్థాయిలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు పెరుగుతుండంటంతో వేలాది మంది ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు.ఒక్క జూన్‌లో సంభవించిన వేడిగాలులతోనే 9 యూరోపియన్ దేశాలలో కనీసం 12,000 మంది చనిపోయి నట్లు పలు గణాంకాల వెల్లడిస్తున్నాయి. ముఖ్యంగా బెల్జియం, ఫ్రాన్స్, జర్మనీ, లక్సెంబర్గ్, నెదర్లాండ్స్, స్పెయిన్, స్విట్జర్లాండ్, యునైటెడ్ కింగ్‌డమ్ దేశాలు హీట్ వేవ్‌కు తీవ్రంగా ప్రభావితమ య్యాయి. తీవ్రమైన ఉష్ణోగ్రతల కారణంగా గుండె, శ్వాసకోశ సంబంధిత వ్యాధులు మరింత తీవ్ర మవ్వడం తోదాదాపు 85% మంది 65 ఏళ్లు లేదా అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్నవారు మృతి చెందారని పలు ఆరోగ్య సంస్థలు వెల్లడించాయి. ఇంకా ఈ మరణాలు పెరిగే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. తీవ్రమైన వడగాడ్పులు అంతటా విస్తరిస్తుండడంతో యూరప్‌లోని అనేక ప్రాంతాలు ప్రస్తుతం తీవ్రమైన వాతావరణ పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. అత్యధిక ఉష్ణోగ్రతలు అనేక దేశాలలో జనజీవనం, ప్రజారోగ్యం, మౌలిక సదుపాయాలపై ప్రభావం చూపుతున్నాయి. ఇవి మానవ తప్పిదాల వల్లే జరుగుతున్నా యని, వీటిని సరి చేయలేక భవిష్యత్‌లో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని వరల్డ్ వెదర్ అట్రిబ్యూషన్‌కు చెందిన వాతావరణ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.

## ఫీఫా వరల్డ్ కప్ ఫైనల్ సందర్భంగా బార్ల సమయం పొడిగింపు

మొదటి తరువాయి

వస్తోంది. పబ్లిక్ ప్లేస్‌లలో ఇతరులతో కలిసి బిగ్ స్క్రీన్‌పై వీక్షించే అవకాశం లేకుండా పోయింది. ఈ క్రమంలో బార్ల పనివేళలను పొడిగించాలని తెలంగాణ బార్ అండ్ రెస్టారెంట్స్ ఓనర్స్ అసోసియేషన్ జూలై 14న ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. దీనిపై సానుకూలంగా స్పందించిన రెవెన్యూ శాఖ తాజాగా అనుమతులు మంజూరు చేయగా, ఎక్సైజ్ కమిషనర్ సి. హరికరణ్ సంబంధిత అధికారులకు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ నిర్ణయంతో ఫుట్‌బాల్ ప్రేమికులు స్నేహితులతో కలిసి బిగ్ స్క్రీన్‌పై మ్యాచ్‌లను తిలకిస్తూ ఆనందించే అవకాశం లభించింది. అయితే, పొడిగించిన పనివేళల్లో ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా పాటించాలని, భద్రతా ప్రమాణాల విషయంలో ఎటువంటి రాజీ పడకూడదని అధికారులు స్పష్టం చేశారు.

## నేడే నింగిలోకి విక్రమ్-1

-ప్రయోగించనున్న హైదరాబాద్ అంకుర సంస్థ స్కైరూట్ ఏరోస్పేస్
-దేశంలోనే తొలి ప్రైవేట్ ఆర్బిటల్ రాకెట్ అభివృద్ధి
-350 కిలోల బరువు గల ఉపగ్రహాలను మోసుకెళ్లే సామర్థ్యం




న్యూఢిల్లీ

భారతీయ స్పేస్ టెక్ స్టార్టప్ స్కైరూట్ ఏరోస్పేస్ శనివారం చరిత్ర సృష్టించడానికి సిద్ధంగా ఉన్నది. స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన తన విక్రమ్-1 రాకెట్ మొదటి ఆర్బిటల్ లాంచ్ చేయనున్నది. ఈ మిషన్ 'ఆగమన్'లో పూర్తిగా ప్రైవేట్‌గా అభివృద్ధి చేసిన లాంచ్ వెహికల్ ఉపయోగించి పేలోడ్‌ను కక్ష్యలోకి ప్రవేశపెట్టనున్నారు ఈ రాకెట్ శ్రీహరికోటలోని సతీశ్‌ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి ప్రయోగించనున్నారు. "భూమిపై విక్రమ్-1ను పరీక్షించడానికి చేయగలిగినదంతా మేము చేశాం. జూలై 18న, మొదటిసారిగా నిజమైన ఫ్లైట్ వాతావరణంలో విక్రమ్-1 ఎలా పనిచేస్తుందో చూడటానికి మేం ఆసక్తిగా ఉన్నాం" అని కంపెనీ సహ వ్యవస్థాపకుడు, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పవన్‌కుమార్ చందన చెప్పారు.

విక్రమ్-1 అంటే ఏమిటి?

విక్రమ్-1 అనేది పూర్తిగా నాలుగు దశల ఆర్బిటల్ లాంచ్ వెహికల్. మొదటి మూడు దశలు సాలిడ్ ప్రొపల్షన్‌ను ఉపయోగిస్తాయి. నాలుగో దశ ఆర్బిటల్ ఇన్సర్షన్, ప్రిసిషన్ విన్యాసాల కోసం లిక్విడ్ ఇంజిన్‌ను ఉపయోగిస్తుంది. 350 కిలోల వరకు బరువు ఉన్న చిన్న ఉపగ్రహాలను ఎర్త్ ఆర్బిట్‌కి తీసుకెళ్లడానికి దీనిని నిర్మించారు. దీని మొదటి టెస్ట్ ఫ్లైట్ 60 డిగ్రీల వాలులో 450 కిలోమీటర్ల కక్ష్యను చేరుకోవడానికి ప్రయత్నిస్తుంది. విక్రమ్-1 భారతీయ ఎర్త్ అబ్జర్వేషన్ నానోశాటిలైట్ మేకర్ గ్రహ స్పేస్, తదితర సంస్థల నుంచి బహుళ సాంకేతిక ప్రదర్శన పేలోడ్‌లను తీసుకెళ్లనుంది.

## అమెరికా గుట్టు.. చైనా చేతికి !

-22 కోట్ల అమెరికా ప్రజల డేటా డ్రాగన్ గుప్పిట్లో
- చైనాపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంచలన ఆరోపణలు
- అమెరికా ఎన్నికల వ్యవస్థలోకి జోక్యానికి డ్రాగన్ ప్రయత్నం
- ఇంటెలిజెన్స్ నివేదికలు డీక్లాసిఫై చేసినట్లు వెల్లడి



న్యూఢిల్లీ

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చైనాపై సంచలన ఆరోపణలు చేశారు. సుమారు 22 కోట్ల మంది అమెరికన్ ఓటర్ల వ్యక్తిగత సమాచారం చైనా చేతికి చేరిందని, ఆ డేటాను అమెరికా ఎన్నికల వ్యవస్థలోకి జోక్యానికి ఉపయోగించే ప్రయత్నం జరిగిందని ఆరోపించారు. జాతీయ భద్రతకు సంబంధించిన 2020 జనవరి నుంచి 2026 జూన్ వరకు ఉన్న ఇంటెలిజెన్స్ నివేదికలను డీక్లాసిఫై చేసినట్లు ప్రకటిస్తూ ఈ విషయాలను వెల్లడించారు. దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించిన ట్రంప్.. అమెరికా చరిత్రలోనే అతిపెద్ద ఎన్నికల డేటా లీక్ వెనుక చైనా పాత్ర ఉందని ఆరోపించారు. ఓటర్ల పేర్లు, చిరునామాలు, ఫోన్ నంబర్లు, రాజకీయ అనుబంధాల వంటి సున్నితమైన వివరాలను సేకరించి ఎన్నికలపై ప్రభావం చూపే ప్రయత్నం చేసిందని విమర్శించారు.

2020 నుంచే డేటా సేకరణ

2020 ఎన్నికల సమయంలోనే చైనా ఈ సమాచారాన్ని సేకరించడం ప్రారంభించిందని, ఇటీవలి వరకు ఆ ప్రక్రియ కొనసాగిందని ట్రంప్ తెలిపారు. ఈ సమాచారాన్ని ఉపయోగించి సదరు ఓటర్ల సమూహ, ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేసే చర్యలకు పాల్పడే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

జాతీయ భద్రతకు ముప్పు

ఈ వ్యవహారం అమెరికా జాతీయ భద్రతకు తీవ్రమైన ముప్పుగా మారిందని ట్రంప్ పేర్కొన్నారు. ఎన్నికల డేటాను విశ్లేషించి రాజకీయ ప్రయోజనాలకు వినియోగించేందుకు చైనా ప్రత్యేక యూనిట్ను ఏర్పాటు చేసిందని ఆరోపించారు. ఈ అంశంపై ఉన్న కీలక సమాచారాన్ని కొందరు ఇంటెలిజెన్స్ అధికారులు ఉద్దేశపూర్వకంగా దాచిపెట్టారని కూడా విమర్శించారు. ట్రంప్ ఆరోపణలు అమెరికా-చైనా మధ్య ఇప్పటికే ఉద్రిక్తంగా ఉన్న సంబంధాలను మరింత ప్రభావితం చేసే అవకాశముందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# కేదార్‌నాథ్‌లో విరిగిపడ్డ కొండచరియలు



**న్యూఢిల్లీ జూలై 17 జర్నలిస్ట్ డైరీ.**
కుండపోత వర్షాల కారణంగా కేదార్‌నాథ్ పాదయాత్ర మార్గంలో గౌరీకుండ్ కు వెళ్లే దారిలో పలుచోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ప్రయాణికుల భద్రత దృష్ట్యా అధికారులు కేదార్‌నాథ్ యాత్రను తాత్కాలికంగా నిలిపివేశారు.ప్రస్తుతం శిథిలాలను తొలగించే పనులు అధికారులు చేపట్టారు. వాతావరణ పరిస్థితులు అనుకూలించి, ప్రయాణ మార్గం సురక్షితమని తెలిపిన తరువాతే యాత్ర ప్రారంభమవుతుంది. పనులు పూర్తయ్యేవరకు యాత్రికులు అప్రమత్తంగా ఉండాలని రుద్రప్రయాగ్ జిల్లా విపత్తు నిర్వహణ అధికారి రాజ్వార్ సూచించారు. అనవసర ప్రయాణాలు మానుకొని, పరిపాలన యంత్రాంగం జారీ చేసిన సూచనలను పాటించాలని కోరారు. రాబోయే రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపినందున భక్తులు కేదార్‌నాథ్ యాత్రను కొన్ని రోజులు వాయిదా వేసుకుంటే మంచిదని తెలిపారు.

# పట్టాలెక్కిన తొలి హైడ్రోజన్ రైలు.

. జింద్-సోనిపట్ మధ్య పరుగులు



**చండీఘర్ జూలై 17 జర్నలిస్ట్ డైరీ.**
దేశంలో తొలి హైడ్రోజన్ ఆధారిత రైలును శుక్రవారం ప్రధాని మోదీ ప్రారంభించారు. హర్యానాలోని జింద్–సోనిపట్ మార్గంలో నార్తర్న్ రైల్వే ఆధ్వర్యంలో 89 కిలోమీటర్ల పరిధిలో ఈ రైలు నడుస్తుంది.ఈ రైలు హైడ్రోజన్ ఇంధన సెల్స్‌ను వినియోగించుకుని పవర్‌ను సృష్టించుకుని నడుస్తుంది. ఈ రైలు ప్రారంభంతో ప్రపంచంలో హైడ్రోజన్ రైళ్లు కలిగిన యూఎస్, చైనా, జపాన్, జర్మనీ దేశాల సరసన భారత్ చేరింది. 10 బోగీల హైడ్రోజన్ ఇంధన సెల్ ఆధారిత రైలు ఇది.

# గిగ్ వర్కర్లకు కొత్త పెన్షన్ స్కీమ్!

**ఈపీఎఫ్‌వో 3.0లో భాగంగా ప్రతిపాదన**




**న్యూఢిల్లీ జూలై 17 జర్నలిస్ట్ డైరీ.**
సంఘటిత, అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు కొత్త కాంట్రిబ్యూటరీ పెన్షన్ పథకం తీసుకురాబోతున్నట్టు తెలుస్తోంది. కార్మికులు, యజమానులు ఇచ్చే వాటాలను సేకరించి దీర్ఘకాలిక ప్రభుత్వ హామీ ఉన్న సెక్యూరిటీలలో పెట్టుబడి పెట్టి ప్రతి సంవత్సరం అందులో వడ్డీని జమ చేస్తారు. గిగ్ వర్కర్లకు 60 ఏండ్లు వచ్చాక ఈ పథకంలో ప్రతిపాదించిన టార్గెట్ రిటైర్మెంట్ సమ్‌ను అప్పటికి అమల్లో ఉన్న అన్యుటీ, వడ్డీ రేట్ల ఆధారంగా నెలవారీ పెన్షన్‌గా సమకూరుస్తారని కేంద్రానికి చెందిన ఓ అధికారి వెల్లడించారు.ఈ కొత్త పథకాన్ని ఈపీఎఫ్‌వో చేపట్టే తదుపరి సంస్కరణలలో భాగంగా అమలు చేయాలని చూస్తోంది. ప్రస్తుతం ఉద్యోగ పెన్షన్ పథకంలో లేని కార్మికులకు కూడా పెన్షన్ భద్రత కల్పించడమే దీని ప్రధాన లక్ష్యం. సింగపూర్ లాంటి అభివృద్ధి చెందిన దేశాల్లో ఉన్న రిటైర్మెంట్ నిధుల విధానాలను అధ్యయనం చేసి అందులో అత్యుత్తమ పద్ధతులను అమలు చేయాలని చూస్తున్నట్టు సదరు అధికారి తెలిపారు.

# బ్రిటన్ తదుపరి ప్రధానిగా బర్న్‌హామ్.. లేబర్ పార్టీ నేతగా ఎన్నిక

**20న ప్రధానిగా బాధ్యతలు**

**లండన్, జూలై 17 జర్నలిస్ట్ డైరీ.**
యూకేలో లేబర్ పార్టీ నేతగా ఆండీ బర్న్‌హామ్ ఎన్నికయ్యారు. సోమవారం బ్రిటన్ ప్రధాన మంత్రిగా బాధ్యతలు చేపట్టడానికి ముందు మధ్య లండన్‌లో జరిగిన ఒక ప్రత్యేక సమావేశంలో మెకర్‌ఫీల్డ్ ఎంపీ బర్న్‌హామ్ పార్టీ నాయకుడిగా ఖరారయ్యారని బీబీసీ నివేదించింది.కాగా, లేబర్ పార్టీ నేతగా జరిపిన తొలి ప్రసంగంలో బర్న్‌హామ్ మాట్లాడుతూ కీర్ స్టార్మర్ వేసిన పునాదులపై పార్టీని నిర్మించి దానిని నడిపించడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు. స్టార్మర్ నాయకత్వంలో పార్టీ అత్యంత ఘోర పరాజయం నుంచి అత్యుత్తమ విజయం వైపు సాగిందని ఆయన పేర్కొన్నారు.



# గత ఆరు నెలల్లో.. 554 మంది భర్తల హత్యలు, ఆత్మహత్యలు

**న్యూఢిల్లీ జూలై 17 జర్నలిస్ట్ డైరీ.**
గత ఆరు నెలల్లో సుమారు 554 మంది భర్తలు హత్యకు గురికావడంతో పాటు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. దేశంలో ప్రతిరోజూ సగటున ఇద్దరు భర్తలు హత్యకు గురికాగా, ఒకరి కంటే ఎక్కువ మంది భర్తలు ఆత్మహత్య చేసుకున్నారు. గురుగ్రామ్‌కు చెందిన 'ఏకం న్యాయ్ ఫౌండేషన్' దీనికి సంబంధించి ఒక నివేదిక విడుదల చేసింది. 2026 జనవరి నుంచి జూలై 14 వరకు మీడియాలో వచ్చిన వార్తలు, ఆ సంస్థ సేకరించిన వివరాల ఆధారంగా ఒక రిపోర్ట్‌ను తయారు చేసింది. ఈ ఏడాది మొదటి ఆరు నెలల్లో దేశవ్యాప్తంగా భర్తల హత్యలు, ఆత్మహత్యలకు సంబంధించిన 554 సంఘటనలను తాము నమోదు చేసినట్లు ఆ సంస్థ పేర్కొంది. వివాహేతర సంబంధాలు, వైవాహిక వివాదాలు ప్రధాన కారణమని పేర్కొంది.కాగా, ఈ నివేదిక ప్రకారం భార్యలు లేదా వారి ప్రియుల చేతిలో భర్తలు హత్యకు గురైన 322 సంఘటనలు జరిగాయి. అలాగే వైవాహిక వివాదాలు, గృహ హింస, వేధింపులు, తప్పుడు క్రిమినల్ కేసులు, ఇతర సమస్యల కారణంగా భర్తలు ఆత్మహత్య చేసుకున్న 232 ఘటనలను ఆ సంస్థ నమోదు చేసింది. 2026 మొదటి ఆరు నెలల్లో భారతదేశంలో ప్రతిరోజూ సగటున ఇద్దరు భర్తలు హత్యకు గురయ్యారని, ఒకరి కంటే ఎక్కువ మంది భర్తలు ఆత్మహత్య చేసుకున్నట్లు ఈ గణాంకాలు సూచిస్తున్నాయని ఆ ఫౌండేషన్ తెలిపింది. అయితే ఈ కేసుల సంఖ్యలు కేవలం మీడియా నివేదికల ఆధారంగా తాము సేకరించినవేనని, అధికారిక ప్రభుత్వ గణాంకాలు కాదని ఆ సంస్థ స్పష్టం చేసింది. అనేక సంఘటనలు మీడియా దృష్టికి రాలేదని, అలాగే భర్తల హత్యలు లేదా గృహ హింసకు గురైన పురుషుల వివరాలను నమోదు చేసే అధికారిక జాతీయ డేటాబేస్ ఏదీ లేకపోవడంతో వాస్తవ సంఘటనల సంఖ్య



దీనికంటే చాలా ఎక్కువగా ఉండవచ్చని పేర్కొంది. మరోవైపు భర్తల హత్యలకు ప్రధాన కారణం వివాహేతర సంబంధాలేనని ఈ నివేదిక గుర్తించింది. నమోదు చేసిన 322 హత్య కేసుల్లో 194 (సుమారు 60.2 శాతం) ఘటనలకు ఇదే కారణమని తేలింది. వివాహేతర సంబంధాన్ని భర్తలు వ్యతిరేకించినప్పుడు లేదా అడ్డుకున్నందుకు భార్యలు తమ ప్రియులతో కలిసి భర్తలను చంపడానికి కుట్ర పన్నిన ఆరోపణలు అనేక కేసుల్లో ఉన్నాయని ఆ ఫౌండేషన్ తెలిపింది.కాగా, భర్తలు చేసుకున్న 232 ఆత్మహత్యలను కూడా ఈ నివేదిక ప్రస్తావించింది. వీటిలో 104 కేసులు (44.83 శాతం) దీర్ఘకాలిక గృహ వివాదాలే ప్రధాన కారణమని గుర్తించింది. మరో 57 కేసులు (24.57 శాతం) భార్యలు లేదా అత్తమామల వేధింపుల ఆరోపణలు కారమని ఆరోపించింది. 29 కేసులు (12.5 శాతం) వివాహేతర సంబంధాలతో ముడిపడి ఉన్నట్లు పేర్కొంది. తప్పుడు క్రిమినల్ ఆరోపణలు, ప్రియురాళు లేదా వారి కుటుంబాల వేధింపులు, ఇతర అంశాలు వంటివి మిగిలిన కేసులని వివరించింది. అయితే ఈ నివేదిక ప్రకారం గత ఆరు నెలల్లో ఉత్తర ప్రదేశ్‌లో అత్యధికంగా 93 మంది భర్తల హత్యలు, 103 మంది భర్తల ఆత్మహత్యలు నమోదయ్యాయి. మధ్యప్రదేశ్, రాజస్థాన్, తెలంగాణ, మహారాష్ట్ర, హర్యానా, బీహార్, కర్ణాటక, గుజరాత్ రాష్ట్రాలు కూడా అధిక సంఖ్యలో నమోదైన కేసుల జాబితాలో ఉన్నాయి. ఈ సంవత్సరం నమోదైన అత్యంత దారుణమైన 25 కేసులను ఫౌండేషన్ ప్రత్యేకంగా ప్రస్తావించింది. వీటిలో భర్తల తల నరకడం, శరీరాన్ని ముక్కలుగా నరకడం, విషప్రయోగం, ఇంటి నేల కింద పాతిపెట్టడం, సజీవంగా దహనం చేయడం, లోతైన లోయల్లోకి తోసేయడం, భార్యలు లేదా వారి ప్రియుల కుట్రలతో హత్యలు చేయడం వంటి ఘటనలు ఉన్నాయని తెలిపింది.ఇక భర్తల ఆత్మహత్య కేసులలో అనేక మంది బాధితులు వివరణాత్మక సూసైడ్ నోట్లు లేదా వీడియోలు రికార్డ్ చేశారని ఈ నివేదిక పేర్కొంది. దీర్ఘకాలిక వేధింపులు, గృహ హింస, తప్పుడు క్రిమినల్ కేసులు, తమ పిల్లలను కలుసుకోనివ్వకపోవడం లేదా నిరంతర మానసిక క్రూరత్వం వంటి కారణాల వల్ల భర్తలు ఆత్మహత్యలకు పాల్పడినట్లు వివరించింది. కాగా, దేశవ్యాప్తంగా సంచలనం రేపిన కేతన్ అగర్వాల్ హత్య కేసును 'ఏకం న్యాయ్ ఫౌండేషన్' వ్యవస్థాపకురాలు దీపికా నారాయణ్ భరద్వాజ్ ప్రధానంగా ప్రస్తావించారు. అతడి కాబోయే భార్య సియా గోయల్, ఆమె ప్రియుడు చేతన్ కలిసి లోయలోకి తోసి హత్య చేయడం వంటి దారుణాలు దేశంలో ప్రతిరోజూ నమోదవుతున్నాయని తెలిపారు. అయితే భర్తల హత్యలు, గృహ హింసకు గురైన పురుష బాధితుల కోసం అధికారిక నేర గణాంకాలలో ప్రత్యేక వర్గీకరణ లేకపోవడం వల్ల ఈ సమస్య వాస్తవ తీవ్రతను అంచనా వేయడం కష్టమవుతోందని ఆమె అన్నారు.

# ఓటర్ జాబితాలో పేరు లేకుంటే పౌరసత్వం కోల్పోయినట్టు కాదు..

**-సుప్రీంకోర్టు పునరుద్ఘాటన**

**న్యూఢిల్లీ జూలై 17 జర్నలిస్ట్ డైరీ.**
ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) తర్వాత ఓటర్ల జాబితా నుంచి పేరును తొలగించినంత మాత్రాన పౌరసత్వాన్ని కోల్పోయినట్లు కాదని సుప్రీంకోర్టు శుక్రవారం మౌఖికంగా పునరుద్ఘాటించింది. పౌరసత్వాన్ని నిర్ణయించే అంతిమ అధికారం భారత ఎన్నికల సంఘానికి లేదని, అలాగే ఓటర్ల జాబితా నుండి పేరు తొలగించినంత మాత్రాన పౌరసత్వాన్ని కోల్పోయినట్లు కాదని బీహార్ సర్ తీర్పులో తాము స్పష్టం చేశామని సుప్రీంకోర్టు పేర్కొంది. సర్ తర్వాత ఓటర్ల జాబితాలో పేర్లు లేని వ్యక్తుల అప్పీళ్లను విచారించే అప్పిలేట్ ట్రిబ్యునళ్లలో విచారణ ప్రక్రియను క్రమబద్ధీకరించాలని కోరుతూ ప్రసేన్‌జిత్ బోస్ దాఖలు చేసిన పిటిషన్‌ను భారత ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వీ మోహనలతో కూడిన ధర్మాసనం విచారించింది. 19 అప్పిలేట్ ట్రిబ్యునళ్ల ఎదుట(వీటి నుంచి ఇద్దరు న్యాయమూర్తులు రాజీనామా చేశారు) 34 లక్షల అప్పీళ్లు ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్నాయని పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది గోపాల్ శంకరనారాయణన్ కోర్టుకు తెలిపారు.ఇప్పటి వరకు సుమారు 38,000 అప్పీళ్లపై మాత్రమే నిర్ణయం తీసుకున్నారని, వాటిలో కనీసం 70 శాతం అప్పీళ్లపై సానుకూలంగా తీర్పు వచ్చిందని





ఆయన చెప్పారు. అప్పీళ్లు పెండింగ్‌లో ఉండగానే ఓటర్ల జాబితా నుండి పేర్లు కోల్పోయిన వారికి ప్రజా పంపిణీ వ్యవస్థ(పీడీఎస్), అన్నపూర్ణ యోజన వంటి సంక్షేమ పథకాల ప్రయోజనాలను నిరాకరిస్తూ పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం నోటిఫికేషన్లు జారీ చేసిందని సీనియర్ న్యాయవాది పేర్కొన్నారు. అంతేగాకుండా అటువంటి వ్యక్తులకు కుల ధ్రువీకరణ పత్రాలను కూడా నిరాకరిస్తున్నారని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా జస్టిస్ బాగ్చి మాట్లాడుతూ బీహార్ సర్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం, పౌరసత్వాన్ని నిర్ణయించే రాజ్యాంగబద్ధమైన అధికారం ఈసీఐకి లేదని పేర్కొన్నారు. పౌరసత్వంపై సందేహాల కారణంగా ఒక వ్యక్తి పేరును ఓటర్ల జాబితా నుండి తొలగించినపుడు ఆ వ్యక్తి పౌరసత్వ హోదాను నిర్ధారించాలని కోరుతూ కేంద్రానికి దరఖాస్తు చేయాల్సిన బాధ్యత ఈసీఐపై ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. దీనికి సీనియర్ న్యాయవాది స్పందిస్తూ ఓటర్ల జాబితా నుండి పేర్లు తొలగించబడిన వారికి సర్ ప్రక్రియ తర్వాత ప్రభుత్వం ఇతర ప్రయోజనాలను కూడా నిరాకరిస్తుందని ఎవరూ ఊహించలేదని చెప్పారు. ఆ విషయం న్యాయమూర్తుల దృష్టికి వచ్చిందని తాను భావించడం లేదని, ఎందుకంటే అలా జరిగి ఉంటే ఈ అంశంపై విచారణ జరుగుతున్నంత కాలం పౌరులకు లభించే ఇతర పౌర హక్కులకు భంగం కలిగించవద్దని ఒక వాక్యాన్ని తీర్పులో జోడించి ఉండేవారని ఆయన పేర్కొన్నారు. దీనిపై జస్టిస్ బాగ్చి స్పందిస్తూ మా తీర్పు స్పష్టంగా ఉంది. ఆర్టికల్ 9,10,11,12 పరిధిలో పౌరసత్వ హోదా విషయంలో ఈసీఐ ఒక రాజ్యాంగబద్ధమైన అధికారం కలిగిన సంస్థ కాదు. ఓటర్ల జాబితాలపై ఈసీఐకి నియంత్రణ ఉంటుంది. ఒక వ్యక్తిని అందులో చేర్చకూడదని అది నిర్ణయించవచ్చు. అయితే అలా చేయడం వల్ల ఆ వ్యక్తి పౌరసత్వ హోదాను కోల్పోరు. అందుకే, దీనికి సంబంధించి తగిన బాధ్యతను మేము నిర్దేశించాము అని స్పష్టం చేశారు.

# అంతరిక్షంలో చక్కెర.. పాలపుంత కేంద్రంలో గుర్తింపు

**భూమిపై పడ్డ 50 మిలియన్ టన్నులు..**


**జీవానికి అదే ఆరంభం**

**న్యూఢిల్లీ జూలై 17 జర్నలిస్ట్ డైరీ.**
పాలపుంత కేంద్రంలో శాస్త్రవేత్తలు చక్కెర అణువులను కనుగొన్నారు. అంతరిక్షంలోని వాయుమేఘాలు భూమిపై జీవం వికసించడానికి అవసరమైన ఒక ముఖ్యమైన పదార్థాన్ని మోసుకొచ్చి ఉండవచ్చని ఇది సూచిస్తున్నది. అంతరిక్షంలో కనుగొనబడిన మొట్టమొదటి నిజమైన చక్కెర 'ఎరిథ్రులోస్' గెలాక్సీ కేంద్రంలో లభ్యమైంది. స్పానిష్ ఆస్ట్రోబయాలజీ సెంటర్‌కు చెందిన కాస్మోకెమిస్ట్ ఇజాస్కున్ జిమెనెజ్ సెర్రా నేతృత్వంలోని పరిశోధకుల బృందం, అంతరిక్షంలోని ఈ ఎరిథ్రులోస్ మన గ్రహంపై ప్రారంభ జీవక్రియ, పునరుత్పత్తి ప్రక్రియలకు అవసరమైన చక్కెర నిల్వలను అందించడంలో సహాయపడి ఉండవచ్చని విశ్వసిస్తున్నది. సుమారు నాలుగు బిలియన్ సంవత్సరాల క్రితం మన సౌరవ్యవస్థ ఇంకా ఏర్పడుతున్న సమయంలో ఇది జరిగింది. అంతరిక్షం నుంచి దాదాపు 50 మిలియన్ టన్నుల చక్కెర భూమిపై పడింది. ఇది జీవానికి అవసరమైన ప్రాథమిక భాగాలను అందించింది. చక్కెరలు అనేవి కణాలకు శక్తినిచ్చే అణువులు, పెద్ద జీవ అణువులను నిర్మించడానికి అవసరమైన ముడి



పదార్థాలు. ఇవి ఆర్ఎన్ఏ, డీఎన్ఏల నిర్మాణానికి వెన్నెముకలాంటివి. ఈ అంతరిక్ష మేఘాలు విశ్వంలోని ఇతర భాగాల్లో కూడా ఇదేవిధంగా జీవానికి బీజం వేసి ఉండవచ్చని ఈ అధ్యయనం సూచిస్తున్నది. దాదాపు 300 మిలియన్ సంవత్సరాలపాటు సౌరవ్యవస్థలోని ప్రతి గ్రహం గ్రహశకలాలు, ఉల్కల దాడికి గురైంది. మన చంద్రుడు ఏర్పడింది కూడా ఇలానే. ఇదే సమయంలో అంతరిక్ష ధూళి భూమికి చక్కెరను తీసుకువచ్చింది. జీవానికి పూర్వపు అణువులు ఉన్నట్టు గుర్తించిన 'జీ0.693' అనే మేఘాన్ని స్పెయిన్‌లోని రెండు రేడియో టెలిస్కోప్‌లు పరిశీలించాయి. ఈ బృందం మూడు కార్బన్ పరమాణువులు కలిగిన సాధారణ చక్కెరను కనుగొనవచ్చని ఆశించింది. అయితే వారు నాలుగు కార్బన్లు కలిగిన ఎరిథ్రులోస్‌ను కనుగొని ఆశ్చర్యపోయారు. ఇది మూడు కార్బన్ల చక్కెర కంటే కనీసం 8 నుంచి 17 రెట్లు ఎక్కువగా ఉన్నది. గెలాక్సీ కేంద్రంలో ఇంత భారీ మొత్తంలో చక్కెర ఉండటం అంటే భూమికి కూడా దాని ప్రారంభ సంవత్సరాల్లో ఇది చాలా ఎక్కువ మొత్తంలో అందిందని అర్థం.

**భూమిపై ఎంత పడింది?**
మాలిక్యులర్ క్లౌడ్‌లో కొలిచిన ఎరిథ్రులోస్ పరిమాణాన్ని బట్టి భారీ ఉల్కల దాడి జరిగిన కాలంలో 0.5 నుంచి 50 మిలియన్ టన్నుల చక్కెర భూమి ఉపరితలానికి చేరుకుని ఉండవచ్చని పరిశోధకులు అంచనా వేస్తున్నారు. అంతరిక్షంలో చక్కెర ఎలా ఏర్పడుతుందో అర్థం చేసుకోవడానికి వారు ఈ డాటాను ఉపయోగించారు. రెండు కార్బన్ల అణువులైన గ్లైకోలాల్డిహైడ్, ఇథిలీన్ గ్లైకాల్‌ను మోసుకెళ్లే చిన్న ధూళికణాల మంచు ఉపరితలంపై ఇది ఏర్పడిందని విశ్లేషణలో తేలింది. రేడియేషన్ ద్వారా ఇవి ఉత్తేజితమైనప్పుడు, అవి కలిసి ఎరిథ్రులోస్‌ను నిర్మించగలవు. అంతరిక్ష పరిస్థితుల్లో కూడా సంక్లిష్ట అణువులు ఏర్పడగలవని ఈ ఆవిష్కరణ చూపిస్తున్నది. "ఎరిథ్రులోస్‌ను గుర్తించడం చాలా ఉత్తేజాన్ని ఇస్తున్నదని, ఎందుకంటే ఇది ఆర్ఎన్ఏలో భాగమైన రైబోస్ వంటి చక్కెరలను, జీవక్రియల పుట్టుకకు ముఖ్యమైన ఇతర అణువులను అంతరిక్షంలో కనుగొనే అవకాశాన్ని తెరుస్తుంది" అని సహ రచయిత కార్లోస్ బ్రియోన్స్ అన్నారు. ఈ చక్కెరలు విడిపోయినప్పుడు విశ్వంలో మరెక్కడైనా ల్యాండ్ అయి ఉండవచ్చని వారు నిర్ధారించారు.



జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

# కూడంకుళం డేటా లీక్ జాతీయ భద్రతకు హెచ్చరిక



తమిళనాడులోని కూడంకుళం అణు విద్యుత్ కేంద్రానికి సంబంధించిన వేలాది ఫైళ్లు డార్క్ వెబ్‌లో ప్రత్యక్షమయ్యాయన్న వార్త దేశవ్యాప్తంగా తీవ్ర ఆందోళనకు దారితీసింది. ఈ ఘటనపై కేంద్ర ప్రభుత్వం, న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎన్.పీ.సీ.ఐ.ఎల్.) స్పందిస్తూ అణు రియాక్టర్ భద్రతా వ్యవస్థలు లేదా కీలక అణు సమాచారానికి ఎలాంటి నష్టం జరగలేదని స్పష్టం చేసింది. అదే సమయంలో, ప్రాజెక్టుకు సంబంధించిన కొన్ని కాంట్రాక్టర్ సర్వర్లలో డేటా లీక్ జరిగిన అంశాన్ని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపింది. అయితే, ఇక్కడ అసలు ప్రశ్న "రియాక్టర్ హ్యాక్ అయ్యిందా?" అనేది కాదు. అణు మౌలిక వసతులకు సంబంధించిన సున్నితమైన సమాచారం బయటపడిందా? అనేదే. ఇదే అంశం భారత జాతీయ భద్రత, సైబర్ భద్రత, వ్యూహాత్మక మౌలిక వసతుల రక్షణపై తీవ్రమైన చర్చకు దారితీస్తోంది.కూడంకుళం భారతదేశంలో అతిపెద్ద అణు విద్యుత్ కేంద్రం. పూర్తిస్థాయిలో ఆరు యూనిట్లు పనిచేస్తే దాని సామర్థ్యం 6,000 మెగావాట్లు. ప్రస్తుతం రెండు యూనిట్లు పనిచేస్తుండగా, మరో నాలుగు నిర్మాణ దశలో ఉన్నాయి. ఈ ప్రాజెక్టు భారత-రష్యా వ్యూహాత్మక సహకారానికి ప్రతీక. దేశ భవిష్యత్ విద్యుత్ అవసరాల్లో అణుశక్తి వాటాను పెంచాలన్న లక్ష్యానికి కూడంకుళం కీలక ఆధారం. రాయిటర్స్ నివేదిక ప్రకారం, "వరల్డ్ లీక్స్" (వరల్డ్ లీక్స్) అనే రాన్సమ్‌వేర్ గుంపు డార్క్ వెబ్‌లో సుమారు 8.58 లక్షల ఫైళ్లలో, కూడంకుళం ప్రాజెక్టుతో సంబంధం ఉన్నట్లు చెప్పబడుతున్న దాదాపు 19 వేల ఫైళ్లను (14.3 జీబీ) విడుదల చేసింది. వాటిలో బ్లూప్రింట్లు, సరఫరాదారుల వివరాలు, తనిఖీ నివేదికలు, సమావేశాల రికార్డులు, బీమా పత్రాలు వంటి సమాచారం ఉన్నట్లు నివేదిక పేర్కొంది. అయితే, ఈ పత్రాలన్నింటి ప్రామాణికతను స్వతంత్రంగా ధృవీకరించడం ఇంకా జరగలేదని కూడా అదే నివేదిక స్పష్టం చేసింది. ఈ ఘటనలో ఒక ముఖ్యమైన విషయం ఏమిటంటే, లీక్ జరిగినట్లు చెబుతున్న సమాచారం నేరుగా అణు రియాక్టర్ నియంత్రణ వ్యవస్థల నుంచి కాకుండా, ప్రాజెక్టులో పనిచేస్తున్న కాంట్రాక్టర్‌కు సంబంధించిన సర్వర్ ద్వారా బయటపడినట్లు తెలుస్తోంది. అంటే, అణు కేంద్రాన్ని నేరుగా హ్యాక్ చేయకపోయినా, సప్లై చైన్ బలహీనతల ద్వారా కీలక సమాచారం బయటకు వెళ్లే ప్రమాదం ఎంత పెద్దదో ఈ సంఘటన గుర్తుచేస్తోంది. ఇలాంటి డేటా లీక్ వల్ల భారత్‌కు కలిగే నష్టం కేవలం సాంకేతిక అంశం కాదు. మొదటిది జాతీయ భద్రత. ఒక ప్రాజెక్టుకు సంబంధించిన నిర్మాణ పటాలు, పరికరాల అమరికలు, సరఫరా సంస్థల వివరాలు వంటి సమాచారం శత్రుదేశాలు లేదా ఉగ్రవాద సంస్థల చేతికి చేరితే, భవిష్యత్తులో లక్ష్యిత సైబర్ దాడులు లేదా భౌతిక దాడులకు అవి సహాయకారిగా మారే అవకాశం ఉంది. భద్రతా నిపుణులు కూడా ఇదే అంశంపై హెచ్చరిస్తున్నారు. రెండవది ఆర్థిక ప్రభావం. అణు విద్యుత్ ప్రాజెక్టులపై పెట్టుబడులు భారీ స్థాయిలో ఉంటాయి. భద్రతపై అనుమానాలు పెరిగితే బీమా వ్యయాలు, సైబర్ భద్రతపై అదనపు ఖర్చులు, నిర్మాణ ఆలస్యాలు పెరిగే అవకాశం ఉంటుంది. ఇవన్నీ ప్రాజెక్టు వ్యయాన్ని మరింత పెంచవచ్చు.

మూడవది అంతర్జాతీయ విశ్వసనీయత. భారత్ ప్రపంచానికి అణుశక్తి రంగంలో విశ్వసనీయ భాగస్వామిగా ఎదగాలని ప్రయత్నిస్తోంది. ఇటువంటి సంఘటనలు విదేశీ భాగస్వాములు, పెట్టుబడిదారులు, సాంకేతిక సంస్థలలో భద్రతా ప్రమాణాలపై ప్రశ్నలు లేవనెత్తే అవకాశం ఉంది. ముఖ్యంగా అణు రంగంలో విశ్వాసం కోల్పోవడం వ్యూహాత్మకంగా కూడా ప్రతికూల ప్రభావం చూపుతుంది.

నాలుగవది ప్రజల విశ్వాసం. అణు విద్యుత్ కేంద్రాలపై ప్రజల్లో ఇప్పటికే కొంత భయం ఉంటుంది. అలాంటి సమయంలో డేటా లీక్ వార్తలు వస్తే, నిజానికి రియాక్టర్ సురక్షితంగానే ఉన్నప్పటికీ ప్రజల్లో అనవసర భయాందోళనలు పెరగవచ్చు. అందుకే ఇలాంటి సందర్భాల్లో ప్రభుత్వం పారదర్శకంగా, వేగంగా, సాక్ష్యాలతో సమాచారాన్ని వెల్లడించడం అత్యంత అవసరం.

ఇది కొత్త హెచ్చరిక కూడా కాదు. 2019లో కూడంకుళం కేంద్రానికి అనుబంధ పరిపాలనా నెట్‌వర్క్‌లో మాల్వేర్ గుర్తించిన విషయాన్ని ఎన్.పీ.సీ.ఐ.ఎల్. ధృవీకరించింది. అప్పుడే కీలక నియంత్రణ వ్యవస్థలు వేరుగా ఉండటం వల్ల ప్రమాదం తప్పిందని తెలిపింది. అంటే, ఈ తాజా ఘటనతో భారత అణు రంగం సైబర్ భద్రతను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం మరోసారి స్పష్టమైంది.

ఈ సంఘటన నుంచి మూడు ప్రధాన పాఠాలు నేర్చుకోవాలి. మొదటిది, కేవలం అణు కేంద్రాలనే కాదు, వాటితో పనిచేసే ప్రతి కాంట్రాక్టర్, డేటా సెంటర్, సాఫ్ట్‌వేర్ సంస్థ కూడా ఒకే స్థాయి సైబర్ భద్రతా ప్రమాణాలు పాటించాలి. రెండవది, కీలక మౌలిక వసతులపై క్రమం తప్పకుండా స్వతంత్ర సైబర్ ఆడిట్లు నిర్వహించాలి. మూడవది, డేటా లీక్ జరిగినప్పుడు ప్రజలకు స్పష్టమైన, సమయానుకూల సమాచారం అందించే వ్యవస్థను బలోపేతం చేయాలి.ప్రస్తుతం అందుబాటులో ఉన్న అధికారిక సమాచారం ప్రకారం, అణు రియాక్టర్ల భద్రతా వ్యవస్థలు దెబ్బతినలేదు అని ప్రభుత్వం చెబుతోంది. అయితే, అందువల్ల ఈ సంఘటన ప్రాముఖ్యత తగ్గిపోదు. ఎందుకంటే ఆధునిక యుద్ధాల్లో ట్యాంకులు, క్షిపణులు మాత్రమే కాదు; సమాచారమే అత్యంత విలువైన ఆయుధం. ఆ సమాచారాన్ని రక్షించడంలో చిన్న నిర్లక్ష్యం కూడా దేశ భద్రతకు దీర్ఘకాలిక ముప్పుగా మారే అవకాశం ఉంది. అందువల్ల కూడంకుళం డేటా లీక్‌ను ఒక సాధారణ సైబర్ ఘటనగా కాకుండా, భారతదేశంలోని అన్ని కీలక మౌలిక వసతుల సైబర్ భద్రతను పునఃసమీక్షించాల్సిన హెచ్చరికగా చూడాల్సిన అవసరం ఉంది.

**డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్.**
ramkishore.1504@gmail.com

---

## బీజేపీ సీనియర్ నాయకుడు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి జన్మదిన వేడుకలు

**- కాశీ విశ్వనాథ స్వామికి ప్రత్యేక అభిషేకాలు.. ఆయురారోగ్యాల కోసం ప్రార్థనలు**




**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 17 (జర్నలిస్ట్ డైరీ) :**
బీజేపీ షాద్‌నగర్ నియోజకవర్గ సీనియర్ నాయకుడు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం షాద్‌నగర్ పట్టణంలోని కిషన్‌నగర్ వేద పాఠశాల ప్రాంగణంలో ఉన్న శ్రీ కాశీ విశ్వనాథ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు ఘనంగా నిర్వహించారు.

వేద పండితులు వేదమంత్రోచ్చారణల మధ్య పరమేశ్వరునికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి, పండ్ల రసాలతో మహాభిషేకం నిర్వహించి, పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డికి ఆయురారోగ్యాలు, దీర్ఘాయుష్షు, సుఖశాంతులు కలగాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రజాసేవలో మరింత విజయాలు సాధించి ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించాలని స్వామివారిని వేడుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయన ప్రజాసేవా కార్యక్రమాలు మరింత విస్తరించాలని ఆకాంక్షించారు. సమాజ సేవలో ఆయన మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు, పార్టీ కార్యకర్తలు, వేద పండితులు, భక్తులు పాల్గొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

## యువతకు ఇచ్చిన హామీల అమలుకోసం బీఆర్ఎస్ పోరుబాట..

**- యువ సంగ్రామ సదస్సును విజయవంతం చేయాలి**

**- మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పిలుపు**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 17 (జర్నలిస్ట్ డైరీ) :**
ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ 'యూత్ డిక్లరేషన్' పేరుతో విద్యార్థులు, నిరుద్యోగ యువతకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ విమర్శించారు. యువతకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, నిరుద్యోగ సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ చేపట్టిన యువ సంగ్రామ సదస్సును విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పిలుపు మేరకు, రేపు సరూర్‌నగర్ స్టేడియంలో జరగనున్న యువ సంగ్రామ సదస్సుకు మద్దతుగా ఈ రోజు షాద్‌నగర్ పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ బీఆర్ఎస్ యువ నాయకులు, యువ కార్యకర్తలు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం యువతకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని, నియోజకవర్గంలోని యువత, విద్యార్థులు, నిరుద్యోగులు పెద్ద సంఖ్యలో యువ సంగ్రామ సదస్సుకు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

---

## భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు

**-షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్**

**-ఆషాఢ మాసం సందర్భంగా బోనాల ప్రత్యేకత**

**- షాద్ నగర్ పోచమ్మ ఆలయంలో పారిశుద్ధ్య ఏర్పాట్లు**

**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 17 (జర్నలిస్ట్ డైరీ) :**
తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఆషాఢ మాస బోనాల ఉత్సవాలకు రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణం సిద్ధమవుతోంది. ప్రతి ఏడాది మాదిరిగానే ఈసారి కూడా పట్టణంలోని పరిగి రోడ్డులో ఉన్న శ్రీ పోచమ్మ అమ్మవారి ఆలయంలో వేలాది మంది భక్తులు బోనాలు సమర్పించి అమ్మవారిని దర్శించుకోనున్నారు. కుటుంబ సభ్యుల ఆయురారోగ్యాలు, గ్రామ ప్రజల సుఖశాంతులు, సమృద్ధి కోసం మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో అలంకరించిన బోనాలను తలపై మోసుకుంటూ అమ్మవారికి సమర్పించడం



బోనాల ఉత్సవంలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. బోనాల సందర్భంగా ఆలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో మున్సిపాలిటీ ముందస్తు ఏర్పాట్లపై దృష్టి సారించింది. ఈ మేరకు స్థానిక మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ శుక్రవారం ఆలయ పరిసరాలను సందర్శించి పారిశుద్ధ్య పనులను స్వయంగా పరిశీలించారు. మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బంది ఆలయ ప్రాంగణం, పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. చెత్తను తొలగించడం, డ్రైనేజీలను శుభ్రపరచడం, రహదారులను పరిశుభ్రంగా ఉంచడం వంటి పనులు చేపట్టారు. ఈ సందర్భంగా సిబ్బందికి చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ పలు సూచనలు, సలహాలు అందించి, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ మాట్లాడుతూ, "బోనాల ఉత్సవాలకు వచ్చే భక్తులకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు మున్సిపాలిటీ అన్ని ఏర్పాట్లు చేస్తోంది. తాగునీరు, పారిశుద్ధ్యం, చెత్త తొలగింపు వంటి సేవలను నిరంతరం అందిస్తూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పిస్తాం" అని తెలిపారు.ఆషాఢ మాసంలో నిర్వహించే బోనాలు తెలంగాణకు ప్రత్యేకమైన జానపద, ఆధ్యాత్మిక ఉత్సవం. అమ్మవారికి అన్నం, బెల్లం, పెరుగు, వేపాకులతో తయారు చేసిన బోనాన్ని సమర్పించడం ద్వారా గ్రామ ప్రజలను వ్యాధులు, ఆపదల నుంచి కాపాడాలని భక్తులు ప్రార్థిస్తారు. బోనాల ఊరేగింపులు, పోతురాజుల విన్యాసాలు, డప్పు వాయిద్యాలు, సంప్రదాయ నృత్యాలు ఉత్సవాలకు మరింత వైభవాన్ని తీసుకొస్తాయి. ఈ నేపథ్యంలో షాద్‌నగర్ పోచమ్మ ఆలయం వద్ద కూడా ఈసారి బోనాల వేడుకలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు కొనసాగుతున్నాయి.

---

## లింర హోటల్ ప్రారంభోత్సవం

**- ముఖ్య అతిధిగా హాజరై ప్రారంభించిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 17 (జర్నలిస్ట్ డైరీ) :**
షాద్ నగర్ పట్టణంలో హైదరాబాద్ రోడ్డులో ఏర్పాటు చేసిన లింర హోటల్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ హోటల్ యాజమాన్యం వినియోగదారులకు నాణ్యమైన,రుచికరమైన ఆహారాన్ని అందిస్తూ వ్యాపార రంగంలో మంచి విజయం సాధించాలని ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి తనయుడు రామక్రిష్ణ,కౌన్సిలర్ గౌస్ జానీ,మాదేవ్ పూర్ సర్పంచ్ అనూష రవీందర్ రెడ్డి,లింగందాన సర్పంచ్ నాగిళ్ళ వెంకటేష్,మాజీ సర్పంచులు తాండ్ర విష్ణు వర్ధన్ రెడ్డి,అజయ్ నాయక్,నాయకులు పర్వేస్,యువ నాయకులు శివ చారి,అన్వారీ రాజు సుధీర్,మధు తదితరులు పాల్గొన్నారు.

---

## కాంగ్రెస్ నుండి బీఆర్ఎస్‌లోకి చేరికలు

**వికారాబాద్ (జర్నలిస్టు డైరీ) జూలై 17**
వికారాబాద్ నియోజకవర్గం, కోటపల్లి మండలం, బీరోల్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ మోముల సుధాకర్ తన యాభై మంది అనుచరులతో కలిసి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ పార్టీ కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. సాధారణంగా అధికార పక్షంలోకి వలసలు ఉంటాయని, కానీ



ఇక్కడ అధికార పార్టీ నుండి ప్రతిపక్షంలోకి చేరికలు జరుగుతున్నాయని ఈ సందర్భంగా ఆనంద్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పై నమ్మకం లేకపోవడం వల్లే నాయకులు కాంగ్రెస్‌ను వీడుతున్నారని ఆయన విమర్శించారు. బీఆర్ఎస్‌లో చేరిన వారిలో మాజీ ఉప సర్పంచ్, మాజీ వార్డు సభ్యులు కూడా ఉన్నారు.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

# కీసర వద్ద ఔటర్ పై రోడ్డు ప్రమాదం ఇద్దరు మృతి



**నాగారం, జూలై 17:-(జర్నలిస్ట్ డైరీ)** కీసర ఔటర్ రింగ్ రోడ్డు పై జరిగిన ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందినట్లు కీసర పోలీసులు తెలిపారు. శుక్రవారం తెల్లవారుజామున జరిగిన ఈ ఘటనలో మెదక్ నుండి గొర్రెల లోడ్ తో చెంగిచెర్ల మండి కి వెళున్న గొర్రెల లోడ్ గల బొలెరో వాహనం ఉదయం నిద్ర రావడంతో కీసర రింగు రోడ్డు పై వాహనం ఆపి నిద్రిస్తున్నారు. అలా నిద్రిస్తున్న వాహనాన్ని మరో గుర్తు తెలియని వాహనం డీ కొట్టడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. వాహనాన్ని రోడ్డు ప్రక్కన అపి నిద్రిస్తున్న ఇద్దరు వ్యక్తులు ఈ ప్రమాదంలో స్పాట్ డెడ్ కాగా వాహనం లోని నిద్రిస్తున్న వ్యక్తి కి స్వల్ప గాయాలు అయ్యాయి అని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు కీసర పోలీసులు తెలిపారు.

# సర్ పై రాజకీయ పార్టీలతో మేడ్చల్ కలెక్టర్ సమావేశం..




**నాగారం, జూలై 17:-(జర్నలిస్ట్ డైరీ)** సర్ కార్యక్రమం పై మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ లో వివిధ రాజకీయ పార్టీల సమావేశం జరిగింది. తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మరియు మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, మేడ్చల్ జిల్లాలోని ఐడిఓసి కార్యాలయంలో శుక్రవారం ఉదయం 11:00 గంటలకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించబడింది. మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లాలో ప్రస్తుతం జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై చర్చించేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేయబడింది. ఈ సమావేశానికి కింది రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరయ్యారు. డాక్టర్ ఎస్. మల్లారెడ్డి బీజేపీ, బి. శ్రీనివాస్ బీజేపీ, మంద సంజీవ రెడ్డి బీఆర్ఎస్, వంగ వెంకట రెడ్డి బీఆర్ఎస్, బి. జైపాల్ రెడ్డి ఇండియన్ నేషనల్ కాంగ్రెస్, ఎం. విజయ్ బీఎస్పీ, కె. జంగా రెడ్డి టీడీపీ ప్రస్తుతం జరుగుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ యొక్క లక్ష్యాలు మరియు పురోగతిని ప్రతినిధులకు వివరించడం జరిగింది, అలాగే వారి అభిప్రాయాలు మరియు సూచనలు నమోదు చేయబడ్డాయి.

# ఉప్పల్ తోపుడు బండ్ల వ్యాపారులకు నష్టం లేకుండా.. ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు..!

**- హైడ్రా, ట్రాఫిక్ పోలీసులతో కలిసి నల్ల చెరువు ప్రాంతాన్ని పరిశీలించిన పరమేశ్వర్ రెడ్డి**



**నాగారం, జూలై 17:-(జర్నలిస్ట్ డైరీ)** ఉప్పల్ నల్ల చెరువు ప్రాంతంలో ఏళ్ల తరబడి వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న తోపుడు బండ్ల వ్యాపారులకు నష్టం లేకుండా చూడనున్నట్టుగా ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. ఇదే సమయంలో వరంగల్ జాతీయ రహదారిపై ట్రాఫిక్ సమస్య కూడా లేకుండా చర్యలు చేపట్టనున్నట్లుగా తెలిపారు. ఉప్పల్ నల్ల చెరువు ప్రాంతానికి రింగ్ రోడ్డులోని బస్టాప్ తరలింపు, ఇదే ప్రాంతంలో రహదారి విస్తరణ నేపథ్యంలో రహదారి పక్కన ఉన్న తోపుడు బండ్లతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి, తోపుడు బండ్ల వ్యాపారులకు ప్రత్యామ్నాయం మార్గాలను అన్వేషించడానికి పరమేశ్వర్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. శుక్రవారం హైడ్రా అధికారులు, ట్రాఫిక్ పోలీసులతో కలిసి పరమేశ్వర్ రెడ్డి నల్ల చెరువు ప్రాంతంలో పర్యటించారు. ప్రత్యామ్నాయ చర్యలు గురించి చర్చించారు. త్వరలోనే తుది నిర్ణయం తీసుకుంటామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్ స్పెక్టర్ నాగరాజు, హైడ్రా అధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణ అమరవీరుల స్థూపం, మహనీయుల విగ్రహాల ఆవిష్కరణను విజయవంతం చేయాలి

**అన్ని వర్గాల తెలంగాణ ఉద్యమకారులు అధిక సంఖ్యలో పాల్గొనాలి**
**మాజీ జెడ్పీటిసి పి. వెంకట్ రాంరెడ్డి**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 17 (జర్నలిస్ట్ డైరీ) :** షాద్‌నగర్ పట్టణంలో ఏర్పాటు చేసిన తెలంగాణ అమరవీరుల స్థూపం, మహనీయుల విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల వెల్ఫేర్ అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు పి. వెంకట్ రాంరెడ్డి పిలుపునిచ్చారు. షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటలకు తెలంగాణ అమరవీరుల స్థూపం, మహనీయుల విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా షాద్‌నగర్‌లోని తెలంగాణ ఉద్యమకారుల వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల త్యాగాలను భావితరాలకు చాటిచెప్పేలా ఈ స్థూపం నిలుస్తుందని అన్నారు. అలాగే తెలంగాణ ఉద్యమానికి, సమాజాభివృద్ధికి విశేష సేవలందించిన మహనీయుల విగ్రహాల ఆవిష్కరణ కూడా చారిత్రాత్మక ఘట్టమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి అన్ని రాజకీయ పార్టీలకు చెందిన తెలంగాణ ఉద్యమకారులు, విద్యావంతులు, మేధావులు, తెలంగాణవాదులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పి. వెంకట్ రాంరెడ్డి కోరారు. ఈ సమావేశంలో తెలంగాణ ఉద్యమకారుల వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ. శ్రీనివాస్ రెడ్డి, నాయకులు ఆర్ల యాదయ్య యాదవ్, రవికుమార్ గౌడ్, గాదె సుధాకర్, మేకల వెంకటేష్, కో-కన్వీనర్ జాంగారి రవి, కుడుముల మల్లేష్, సునీల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఘట్‌కేసర్‌లో ఉదయం 10గంటలకి

# సీఎం రేవంత్ రెడ్డి పర్యటన

**-రూ.3.95 కోట్లతో "అందెశ్రీ స్మృతి వనం"కు శంకుస్థాపన**
**-రాష్ట్ర కవి అందెశ్రీ జయంతి వేడుకల్లో పాల్గొనున్న ముఖ్యమంత్రి**
**-కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ పిలుపు**



**నాగారం, జూలై 17:-(జర్నలిస్ట్ డైరీ)** రాష్ట్ర కవి అందెశ్రీ జయంతి సందర్భంగా ఘట్‌కేసర్‌లో శనివారం నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి హాజరుకానున్నారు. ఈ సందర్భంగా రూ.3.95 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న అందెశ్రీ స్మృతి వనం"కు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారు. శుక్రవారం అందెశ్రీ స్మృతి వనం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు తోటకూర వజ్రెష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మల్లిపెద్ది సుధీర్ రెడ్డి పాల్గొన్నారు. తెలంగాణ భాష, సంస్కృతి, సాహిత్య వికాసానికి విశేష సేవలందించిన రాష్ట్ర కవి అందెశ్రీ జ్ఞాపకార్థం ఈ స్మృతి వనాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తోంది. అందెశ్రీ సాహిత్య వారసత్వాన్ని భావితరాలకు పరిచయం చేయడంతో పాటు తెలంగాణ ఆత్మగౌరవం, భాషా వైభవం, సాంస్కృతిక సంపదను ప్రతిబింబించే కేంద్రంగా ఈ స్మృతి వనం రూపుదిద్దుకోనుంది. రాష్ట్ర సాహిత్య, సాంస్కృతిక రంగాలకు సంబంధించిన చారిత్రక విశేషాలను భద్రపరిచే వేదికగా కూడా ఇది నిలవనుందని అధికారులు తెలిపారు. రాష్ట్ర కవి అందెశ్రీ జయంతి సందర్భంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, కవులు, సాహితీవేత్తలు, కళాకారులు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రెష్ యాదవ్ మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమం లో డీసీసీ ఉపాధ్యక్షుడు వేముల మహేష్ గౌడ్, డీసీసీ సెక్రెటరీ ముత్యాల్ యాదవ్, ఘట్కేసర్, ఎదులాబాద్, పోచారం బోడుప్పల్, డివిజన్ల అధ్యక్షులు బొక్క ప్రభాకర్ రెడ్డి, సామల అమర్, కర్రే రాజేష్, పోగుల దిలీప్ రెడ్డి, గడ్డన్నారం ఫ్రూట్స్ మార్కెట్ డైరెక్టర్ మచందర్ రెడ్డి, సీనియర్ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు మాజీ కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై నిరుద్యోగులు,విద్యార్థులు గళం విప్పాలి

**-మహబూబ్ నగర్ ఎమ్మెల్సీ ఎన్. నవీన్ కుమార్ రెడ్డి**
**-యువ సంగ్రామ సదస్సులు విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి పిలుపు**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 17 (జర్నలిస్ట్ డైరీ) :** కాంగ్రెస్ ప్రభుత్వం యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని, ఆ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా శనివారం హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే యువ సంగ్రామ సదస్సును విజయవంతం చేయాలని షాద్‌నగర్ బీఆర్ఎస్ నేత, ఎమ్మెల్సీ ఎన్. నవీన్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులను తీవ్రంగా మోసం చేసిందని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఏటా రెండు లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగులు, విద్యార్థులను పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో 2 లక్షల 32 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయడంతో పాటు దాదాపు 10 లక్షల ప్రైవేటు ఉద్యోగాల కల్పనకు చర్యలు చేపట్టామని తెలిపారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు ఎన్ని ఉద్యోగాలు ఇచ్చిందనే విషయంపై కూడా స్పష్టత ఇవ్వలేకపోతోందని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాయమాటలతో యువతను, విద్యార్థులను ఆకర్షించి అధికారంలోకి వచ్చారని, ఇప్పుడు అదే యువతను రోడ్డుపై నిలబెట్టారని మండిపడ్డారు. నిరుద్యోగులపై లాఠీచార్జీలు చేయించడం తప్ప వారి సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం ఎలాంటి చిత్తశుద్ధి చూపడం లేదని అన్నారు.

నిరుద్యోగులకు కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అన్యాయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకే యువ సంగ్రామ సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సభతో కాంగ్రెస్ ప్రభుత్వానికి కనువిప్పు కలుగుతుందని, నిరుద్యోగుల ఆవేదనే ఈ ప్రభుత్వ పతనానికి నాంది పలుకుతుందని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న విమర్శలు రాజకీయ దురుద్దేశంతో కూడుకున్నవేనని, కాళేశ్వరం తెలంగాణకు శ్రీరామరక్ష లాంటి ప్రాజెక్టు అని ఎమ్మెల్సీ ఎన్. నవీన్ కుమార్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలోని నిరుద్యోగులు, విద్యార్థులు, యువత పెద్ద ఎత్తున శనివారం జరిగే యువ సంగ్రామ సదస్సుకు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# మున్సిపాలిటీ లో ఎన్యుమరేషన్ డిజిటైజేషన్ త్వరితంగా పూర్తి చేయండి

**-ఎన్యుమరేషన్ ఫామ్ ల పంపిణీలో నిర్లక్ష్యం చేయొద్దు**

**ఇంటింటికీ పంపిణీ చేసిన ఎన్యుమరేషన్ ఫామ్ తిరిగి బీఎల్వో లకు ఇవ్వండి**

**-ఆర్డీవో సరిత**

**-నియోజకవర్గంలో 100శాతం ఎన్యుమరేషన్ డిజిటైజేషన్ పూర్తి చేసిన బీఎల్వోలకు బహుమతులు అందజేసిన ఆర్డీవో**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 17 (జర్నలిస్ట్ డైరీ) :** సర్ కార్యక్రమంలో భాగంగా షాద్ నగర్ మున్సిపాలిటీ లో ఎన్యుమరేషన్ డిజిటైజేషన్ త్వరితంగా పూర్తి చేయాలని బీఎల్ఓలు, సూపర్వైజర్లకు ఆర్డీవో సరిత సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ సునీత రెడ్డి, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ బాలవర్ధన్ తో కలిసి బీఎల్వో లు, సూపర్వైజర్లకు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. మున్సిపాలిటీలో ఎన్యుమరేషన్ ఫామ్ ల పంపిణీలో నిర్లక్ష్యం చేయొద్దన్నారు. ఇంటింటికీ పంపిణీ చేసిన ఎన్యుమరేషన్ ఫామ్ తిరిగి బిఎల్వోలకు ఇవ్వాలని, ఓటర్లు ఇచ్చిన ఎన్యుమరేషన్ ఫామ్ లను వెంటనే డిజిటైజేషన్ చేయాలన్నారు. ఇప్పటివరకు మున్సిపాలిటీలో కేవలం 48 శాతం మాత్రమే ఎన్యుమరేషన్ డిజిటైజేషన్ చేశారని, డిజిటైజేషన్ ను వేగవంతం చేయాలన్నారు. 75శాతం ఎన్యుమరేషన్ డిజిటైజేషన్ పూర్తి చేసేలా కృషి చేయాలన్నారు. అదేవిధంగా నియోజకవర్గంలో 100శాతం ఎన్యుమరేషన్ డిజిటైజేషన్ పూర్తి చేసిన బీఎల్వోలను అభినందించి బహుమతులను అందజేశారు. ప్రతి బీఎల్ఓ సూపర్వైజర్ 100% ఎన్యుమరేషన్ డిజిటైజేషన్ పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిఎల్వోలు సూపర్వైజర్లు పాల్గొన్నారు.

# సుల్తాన్పూర్‌లో చెరువు భూమి కబ్జా

**-అధికారుల నిర్లక్ష్యం!**



**వికారాబాద్, 17 జూలై**
బంట్వారం మండలం సుల్తాన్‌పూర్ గ్రామంలో ప్రభుత్వ ఆస్తులకు రక్షణ కరువైంది. గ్రామంలోని ప్రభుత్వ చెరువు భూమిని కొందరు వ్యక్తులు యథేచ్ఛగా ఆక్రమించుకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామానికి చెందిన దీమి లక్ష్మయ్య (తండ్రి: రామయ్య), మరియు దీమి నరసింహులు (తండ్రి: లక్ష్మయ్య) అనే వ్యక్తులు సుల్తాన్‌పూర్ గ్రామ పరిధిలోని చెరువుకు సంబంధించిన సుమారు 2 ఎకరాల భూమిని అక్రమంగా కబ్జా చేశారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా, నీటి వనరుల పరిరక్షణను పక్కనబెట్టి చెరువు భూమిని ఆక్రమించుకున్నా స్థానిక నీటిపారుదల శాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. దీనిపై బాధ్యతగల నీటిపారుదల శాఖ అధికారులకు ఇప్పటికే లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినప్పటికీ, సదరు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ, కబ్జాదారులకు కొమ్ముకాస్తున్నారని బాధితులు, గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.
ఈ భూకబ్జాపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, విచారణ జరిపించాలీ

# అమరవీరుల స్థూపం ఆవిష్కరణను విజయవంతం చేద్దాం!.

**-తెలంగాణ ఉద్యమ కారుల ఐక్య వేదిక**

**టీ యూ జే ఏ సీ**

**-తెలంగాణ జాతి పిత గా ప్రొఫెసర్ జయశంకర్ సార్ ను అధికారికంగా గా ప్రకటించాలి అని సమావేశంలో తీర్మానం.**





**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 17 (జర్నలిస్ట్ డైరీ) :** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ఎంపిడిఓ కార్యాలయం ఆవరణలో స్తానిక శాసన సభ్యులు వీర్లపల్లి శంకర్ సొంత నిధులతో తెలంగాణ అమరవీరుల స్థూపం నిర్మించి జూలై ఆదివారం నాడు 19 వ తేదీన ఆవిష్కరించడం అభినందనీయం అని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమ కారుల ఐక్య వేదిక టీ యూ జే ఏ సీ, ఆనాటి ఎజీూజ నాయకులు అన్నారు.
శుక్రవారం నాడు తెలంగాణ ఉద్యమ కారుల ఐక్య వేదిక టీ యూ జే ఏ సీ డివిజన్ కమిటీ విస్తృత స్థాయి సమావేశం షాద్ నగర్ ఫెన్షనర్ భవన్లో టీజీ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులను గుర్తించే విధంగా ఉద్యమ కారుల గుర్తింపు కమిటీ ఏర్పాటు చేయటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. నిజమైన ఉద్యమ కారులకు న్యాయం జరిగే విధంగా ఈ కమిటీ పని చేయాలని తీర్మానం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రొఫెసర్ జయశంకర్ సార్ ను తెలంగాణ జాతి పితాగా ప్రకటించాలి. అలానే స్తానిక శాసన సభ్యులు వీర్లపల్లి శంకర్ సొంత ఖర్చులతో నిర్మించిన అమర వీరుల స్థూపం ఆవిష్కరణను విజయవంతం చేయాలని, ఉద్యమకారులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపు నిచ్చారు..
ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ కారుల ఐక్య వేదిక టీ యూ జే ఏ సీ సలహా దారులు వంగూరి గంగి రెడ్డి, రాంబల్ నాయక్, పంది వెంకట్రాంరెడ్డి, నక్కల వెంకటేష్ గౌడ్, రామారావు, అబ్దుల్ రబ్ జామి, గౌరవ అధ్యక్షులు పినపాక ప్రభాకర్, అధ్యక్షులు టిజి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి శ్రీధర్ రెడ్డి, కోశాధికారి కే వంశీ కృష్ణ, నాయకులు నందిగామ సురేష్ , అర్జునప్ప, సిరాజ్, సురేష్ రెడ్డి, వెంకట్, బాలు నాయక్, బాబూరావు, రాజా వరప్రసాద్, మేకల వెంకటేష్, ఆర్ల యాదయ్య, రాఘవేంద్ర రెడ్డి, అశోక్ రెడ్డి, రతన్ నాయక్, బుద్దల జంగయ్య తదితరులు పాల్గొన్నారు

## రేపు వికారాబాద్ జిల్లాలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పర్యటన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు



**వికారాబాద్,జర్నలిస్ట్ డైరీ జూలై 17:** రాష్ట్ర రోడ్డు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి రేపు శనివారం వికారాబాద్ జిల్లాలో విస్తృతంగా పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా తాండూరు, పరిగి, వికారాబాద్ నియోజకవర్గాల్లో పర్యటించి పలు రోడ్ల విస్తరణ, బలోపేతం మరియు నిర్వహణ పనులకు ఆయన శంకుస్థాపనలు చేయనున్నారు.

# యాదవుల ఆత్మగౌరవాన్ని కించపరిచిన శివచరణ్ రెడ్డిని వెంటనే బహిష్కరించాలి

**బేరి రామచందర్ యాదవ్ డిమాండ్**



**వికారాబాద్ (జర్నలిస్ట్ డైరీ) 17**
తెలంగాణా రాష్ట్ర యాదాద్రి శ్రీ లక్ష్మి నరసింహాస్వామి దేవస్థాన బోర్డు మెంబెర్ గా బీసీ వర్గం నుండి పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్ గారికీఒక చిన్న పదవి వచ్చిన కారణంగా అగ్ర వర్ణాలకు చెందిన నాయకులు అక్కసు తట్టుకోలేక ఆమెపై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఈ వ్యాఖ్యలను వెంటనే ఖండించి శివచరణ్ రెడ్డి పార్టీ నుండి బహిష్కరించాలని ఈశ్వరమ్మ యాదవ్ కు క్షమాపణ చెప్పాలని బీసీ కుల సంఘాల ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బేరి రామచందర్ యాదవ్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివచరణ్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర యాదవుల ఆత్మ గౌరవాన్ని కించపరిచేలా దుర్భషాలాడుతూ మాట్లాడిన ఆయన తీరుకు నిరసన తెలుపుతూ బేరి రామచందర్ యాదవ్ మిత్రబృందం కలిసి గౌరవనీయులు తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పీసీసీ అధ్యక్షులు శ్రీ మహేష్ కుమార్ గౌడ్ గారికి వినతి పత్రం సమర్పించారు. బేరి గారితో పాటు తెలంగాణ రాష్ట్ర బీసీ

## అంకగణితంలో రీజనల్ స్థాయిలో సత్త చాటిన నాగోలు సీప్ అబాకస్ విద్యార్థులు..



**జర్నలిస్ట్ డైరీ, నాగోలు:**
సీప్తోబాకస్ అకాడమీ ఆధ్వర్యంలో అంకగణితంలో రీజినల్ ప్రాడిజీ 2026 పోటీలు నగరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రం నుండి 3300 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈసందర్భంగా విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని పోటీలలో ప్రతిభను కనబరిచారు. అంకగణితం పోటీలో నాగోలు సీప్ అబాకస్ నుండి 90 మంది విద్యార్థులు పాల్గొని 60మందిపైగా విద్యార్థులు విజయం సాదించారు. ఈ పోటీలో కేవలం 11 నిమిషాల్లో 200 లెక్కలు చేయాల్సి ఉంటుంది. హోరా హోరీగా సాగిన ఈ పోటీలో నాగోలు సీప్ అబాకస్ విద్యార్థులు సత్తా చాటారు. నాగోలు సీప్ అబాకస్ విద్యార్థులు మార్తా ప్రిన్సెస్, సాయి సుశాంత్, జశ్వంత్ సాయికుమార్, ఆశ్మిత్రెడ్డి, రీతిక్ బొజ్జం, ప్రతీక్, స్నేహల్రెడ్డి, పునీత్ సాయి. దివిజ్. హన్సిలను వివిధ విభాగంలో మొదటి. ద్వితీయ, తృతీయ స్థానాలు 11ట్రోపీలు గెలుకున్నారు. మరో 49 మంది విద్యార్థులు పెర్ఫార్మర్ అవార్డులను గెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రతిభ చాటి ఆవార్డులు గెలుసుకున్న విద్యార్థులకు శుక్రవారం నాగోలు సీప్ అబాకస్ అకాడమీ నిర్వాహకులు కుండే రాదిక బహుమతులు అందజేసి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో సీప్ అబాకస్ అకాడమీ సిబ్బంది సామ్య. రిషిత, శ్రావణి. వరలక్ష్మి, మౌనిక, శారదదేవి. అరుణ, రాణి తెలిపారు
-సీజనల్ స్థాయి పోటీలల్లో ఆవార్డులు సాదించిన నాగోలు సీప్ ఆబాకస్ విద్యార్థులకు

## గణితం ఏకగ్రత, జ్ఞాపకశక్తి పెంచేందుకు కృషి చేస్తుంది

**- అబికాస్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న విద్యార్థులు..**




**అబాకస్ గ్రాడ్యుయేషన్ పట్టాలు సాధించిన ఆర్ కేపురం సీప్ అబికాస్ విద్యార్థులు**

**జర్నలిస్ట్ డైరీ, ఆర్కేపురం:**
ఆర్కపురం డివిజన్ లోని వాసవి కాలనీలోని సీప్ అబికాస్ కేంద్రంకు చెందిన విద్యార్థులు చిన్ని శివాని రెడ్డి. బి. జైతిన్ సాయి. నివతి రెడ్డి విజయవంతంగా తమ అబాకస్ కోర్సును పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా గురువారం నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డేలో విద్యార్థులకు పాట్టాలు అందజేశారు. వాసవి కాలనీ ఇన్స్టిట్యూట్ డైరెక్టర్ కె. సంధ్యారాణి మాట్లాడుతూ అబికాస్ నేర్చుకోవడం అనేది కేవలం గణిత నైపుణ్యాలకే పరిమితం కాకుండా ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, వేగవంతమైన ఆలోచన, ఆత్మవిశ్వాసం. క్రమశిక్షణ వంటి విలువైన జీవిత నైపుణ్యాలను పెంపొందించే ఒక అద్భుతమైన ప్రయాణం. ఈ ప్రయాణాన్ని విజయవంతంగా పూర్తిచేసిన ఈ ముగ్గురు విద్యార్థులు తమ నిరంతర శ్రమ, పట్టుదల. క్రమశిక్షణ మరియు అంకితభావంతో ఈ ఘనతను సొంతం చేసుకున్నారు. విద్యార్థుల ఈ విజయానికి వారి తల్లిదండ్రులు అందించిన నిరంతర ప్రోత్సాహం, సహకారం విశ్వాసం ఎంతో కీలక పాత్ర పోషించాయి. అలాగే ప్రతి దశలో విద్యార్థులను ప్రోత్సహిస్తూ. ఉత్తమ శిక్షణ అందించిన ఉపాధ్యాయుల కృషి కూడా అభినందనీయమని పేర్కొన్నారు.

# సరూర్‌నగర్‌లో నేడు బీఆర్ఎస్ 'యువ సంగ్రామ సదస్సు'



**ఇబ్రహీంపట్నం, (జూలై 17) జర్నలిస్ట్ డైరీ.**
విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అందించడం, నిరుద్యోగులకు ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శనివారం సరూర్‌నగర్ స్టేడియంలో 'యువ సంగ్రామ సదస్సు' నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్వీ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అధ్యక్షుడు నిట్టు జగదీశ్వర్ తెలిపారు.
శుక్రవారం ఆయన మీడియా తో మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం "యూత్ డిక్లరేషన్" పేరుతో నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేసిందని విమర్శించారు. ప్రభుత్వం ఎలాంటి అడ్డంకులు సృష్టించినా యువ సంగ్రామ సదస్సును విజయవంతంగా నిర్వహిస్తామని స్పష్టం చేశారు. సరూర్‌నగర్ వేదికగా యువత, విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలతో పాటు ప్రభుత్వ వైఖరిపై గళమెత్తనున్నట్లు ఆయన తెలిపారు. తెలంగాణ వ్యాప్తంగా ఉన్న యువత, విద్యార్థులు, నిరుద్యోగ యువతీ యువకులు పెద్ద సంఖ్యలో హాజరై సదస్సును విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# బిజినెస్

## తగ్గుతున్న బంగారం ధరలు..
## తెలుగు రాష్ట్రాల్లో 10గ్రాములు ఎంతుందంటే?

## యమహా నుంచి కొత్త ఎలక్ట్రిక్ స్కూటర్..

### 117 కి.మీ. రేంజ్.. ధర ఎంతో తెలుసా?



యమహా తన కొత్త ఎలక్ట్రిక్ స్కూటర్ అయిన యమహా ఏరాక్స్ ఇని భారతదేశంలో విడుదల చేసింది. దీని ప్రారంభ ఎక్స్-షోరూమ్ ధర రూ. 2.82 లక్షలు (ఢిల్లీ). గత సంవత్సరం పరిచయం చేసిన ఈ ఎలక్ట్రిక్ స్కూటర్.. ఇప్పుడు భారతదేశంలోని కొన్ని నగరాల్లో కొనుగోలుకు అందుబాటులో ఉంది. ప్రస్తుతం యమహా ఏరాక్స్ ఢిల్లీ, బెంగళూరు, చెన్నై, ముంబై, పూణేలలో అమ్మకానికి అందుబాటులో ఉంది. ఈ ఎలక్ట్రిక్ స్కూటర్ ఏథర్ 450 అపెక్స్, టీవీఎస్ ఎక్స్, ఓలా ఎస్1 ప్రో వంటి శక్తివంతమైన ఎలక్ట్రిక్ స్కూటర్లతో పోటీపడుతుంది.

**పవర్‌ట్రెయిన్**


యమహా ఏరాక్స్ జులో రెండు 1.5kWh తొలగించగల బ్యాటరీ ప్యాక్‌లు ఉన్నాయి. ఇది పర్మనెంట్ మాగ్నెట్ సింక్రోనస్ మోటార్ (PMSM) ద్వారా పనిచేస్తుంది. ఇది 9.4ఎౙ (12.60hp) శక్తిని, 48చీఎ టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. కంపెనీ ప్రకారం, ఈ ఎలక్ట్రిక్ స్కూటర్ పూర్తి ఛార్జ్‌పై IDC-ధృవీకరించిన 117 కిలోమీటర్ల వరకు రేంజ్‌ను అందించగలదు. పవర్ మోడ్‌లో బూస్ట్ ఫీచర్‌ను ఎనేబుల్ చేసినప్పుడు దీని గరిష్ట వేగం 95.5 km/h వరకు చేరుకోగలదు.

బంగారం ధరల్లో ఊహించని మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఇటీవల రికార్డు స్థాయిలో దూసుకెళ్లిన పసిడి ధరలు.. తగ్గుముఖం పట్టాయి.. ఇరాన్ -- అమెరికా యుద్ధం, అలాగే ప్రపంచవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో చోటుచేసుకున్న ఉద్రిక్త పరిస్థితులతో బంగారం, వెండి ధరల్లో ఊహించని మార్పులు చోటుచేసుకుంటున్నాయని బులియన్ మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. ఇదిలాఉంటే.. బుధవారం పెరిగిన ధరలు.. గురువారం తగ్గాయి.. ఒక్కరోజే పది గ్రాముల స్వచ్ఛమైన బంగారంపై రూ.300 మేర ధర తగ్గింది. జులై 17 గురువారం పలు వెబ్‌సైట్లలో నమోదైన ధరల ఆధారంగా ఉదయం 6 గంటల వరకు.. దేశీయంగా బంగారం, వెండి ధరలు ఈ కింది విధంగా ఉన్నాయి.

**24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాముల ధరపై రూ.10 మేర తగ్గి.. రూ.1,43,280 గా ఉంది. 22 క్యారెట్ల పసిడి రేటు 10 గ్రాములపై రూ.10 తగ్గి.. రూ.1,31,340 గా ఉంది.**

వెండి కిలో ధర రూ.100 తగ్గి.. రూ.2,34,900 లు గా కొనసాగుతోంది.

అయితే.. ప్రాంతాల వారీగా బంగారం, వెండి ధరల్లో



వ్యాత్యాసం ఉంటుంది.

**ప్రధాన నగరాల్లో బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయంటే..**

హైదరాబాద్‌లో గోల్డ్ 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,43,280, 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1,31,340 గా ఉంది. వెండి కిలో ధర రూ.2,39,900 ఉంది.

విజయవాడ, విశాఖపట్నంలో 24 క్యారెట్ల పసిడి 10 గ్రాముల ధర రూ.1,43,280, 22 క్యారెట్ల గోల్డ్ 10గ్రాముల ధర రూ.1,31,340 ఉంది. వెండి కిలో ధర రూ.2,39,900 ఉంది.

ఢిల్లీలో 24 క్యారెట్ల గోల్డ్ 10 గ్రాముల ధర రూ.1,43,430, 22 క్యారెట్ల ధర రూ.1,31,490 గా ఉంది. వెండి కిలో ధర రూ.2,34,900 ఉంది.

ముంబైలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,43,280, 22 క్యారెట్ల ధర రూ.1,31,340 గా ఉంది. వెండి కిలో ధర రూ.2,34,900 లుగా ఉంది.

చెన్నైలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.143,450, 22 క్యారెట్ల ధర రూ.1,31,490 ఉంది. వెండి కిలో ధర రూ.2,39,900 ఉంది.

బెంగళూరులో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1,43,280, 22 క్యారెట్ల ధర రూ.1,31,340 ఉంది. వెండి కిలో ధర రూ.2,34,900 లుగా ఉంది.

## ఎయిర్‌టెల్ యూజర్లకు షాక్..
## పాపులర్ ప్లాన్ తొలగింపు

దేశీయ టెలికాం దిగ్గజం ఎయిర్‌టెల్ తన రూ.549 పోస్ట్‌పెయిడ్ ప్లాన్‌ను నిశ్శబ్దంగా తొలగించింది. ఈ ప్లాన్ ప్రస్తుతం ఎయిర్‌టెల్ అధికారిక వెబ్‌సైట్, ఎయిర్‌టెల్ థ్యాంక్స్ యాప్‌లో అందుబాటులో లేదు. ఈ మార్పుతో, రూ.449 ప్లాన్ ఇప్పుడు కొత్త పోస్ట్‌పెయిడ్ వినియోగదారులకు ఎంట్రీ-లెవల్ ఎంపికగా మారింది. రూ.549 కంటే ఎక్కువ ప్రయోజనాలు కోరుకునేవారు రూ.699 ఫ్యామిలీ ప్లాన్‌ను ఎంచుకోవాల్సి ఉంటుంది.




## రోహిత్ శర్మ చివరి వన్డే ఆడబోతున్నాడా?

**లండన్:**
టీమిండియా బ్యాటర్ రోహిత్ శర్మ అంతర్జాతీయ వన్డే కెరీర్ ముగియబోతుందా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇంగ్లండ్‌తో లార్డ్స్‌లో జరిగే మూడో వన్డే అతని కెరీర్‌లో చివరి వన్డే అవుతుందని కొన్ని వర్గాల ద్వారా తెలుస్తోంది. భారత క్రికెట్ సెలెక్టర్లు.. రోహిత్‌కు ఉద్వాసన పలికే ఆలోచనలో ఉన్నట్లు సంకేతాలు అందుతున్నాయి. వచ్చే ఏడాది జరిగే వన్డే వరల్డ్‌కప్‌లో అతనికి చోటు దక్కేది అనుమానంగా ఉంది. దీంతో ఇంగ్లండ్ సిరీస్ అతనికి చివరి అవకాశం అవుతుందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.జూన్‌లో ఆఫ్ఘనిస్తాన్‌తో జరిగిన వన్డే సిరీస్ కన్నా ముందే రోహిత్‌కు సెలెక్టర్లు ఈ విషయాన్ని చెప్పినట్లు తెలుస్తోంది. వాస్తవానికి రోహిత్ శర్మకు ఇంకా ఆడాలని ఉంది. కానీ కొందరు సెలెక్టర్లు రోహిత్‌ను ఇంగ్లండ్ సిరీస్ తర్వాత శాశ్వతంగా తప్పించాలని భావిస్తున్న విషయాన్ని ప్రధాన కోచ్ గౌతం గంభీర్ పేర్కొన్నట్లు తెలిసింది. ఇంగ్లండ్‌తో జరిగే మూడో వన్డే తర్వాత రోహిత్ రిటైర్ అవుతారా లేక వరల్డ్‌కప్‌లో ఆడేందుకు ఛాన్సు కోసం





ఎదురుచూస్తాడా అన్న విషయం ఇంకా తేలాల్సి ఉన్నది. మరో వైపు రోహిత్ శర్మ పేరెంట్స్ లార్డ్స్‌కు వెళ్లారు. రోహిత్ ఫేర్‌వెల్ వన్డే ఆడనున్న నేపథ్యంలో అతని పేరెంట్స్ అక్కడికి వెళ్లినట్లు కొన్ని వార్తలు వ్యాపించాయి. వన్డేల్లో రోహిత్ స్థానంలో జైస్వాల్‌కు పర్మనెంట్ ప్లేస్ ఇవ్వాలని బీసీసీఐ ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది. రోహిత్ శర్మ 287 వన్డేలు ఆడాడు. వీటిల్లో 11757 రన్స్ చేశాడు. దీంట్లో 33 సెంచరీలు, 62 హాఫ్ సెంచరీలు ఉన్నాయి.

## వరల్డ్‌కప్ విజేతలకు ఛాంపియన్‌షిప్ రింగ్స్..

### ఫిఫా చరిత్రలో ఇదే తొలిసారి..!

ఫిఫా వరల్డ్‌కప్ ఫైనల్‌కు రెండు రోజులే ఉంది. సెమీస్‌లో అదరగొట్టిన స్పెయిన్, అర్జెంటీనా టైటిల్ పోరుకు కాచుకొని ఉండగా విజేతలకు ప్రత్యేకమైన బహుమతులు ఇవ్వాలని ఫిఫా ఆలోచిస్తోంది. ప్రపంచకప్ చరిత్రలో తొలిసారిగా 'ఛాంపియన్‌షిప్ రింగ్స్' ఇవ్వాలనుకుంటోంది. అమెరికాలో ప్రతిష్ఠాత్మక బాస్కెట్ బాల్ ఈవెంట్.. ఎన్‌బీఏ లో నెగ్గిన జట్టు ఆటగాళ్లకు ఛాంపియన్‌షిప్ రింగ్స్ ప్రదానం చేస్తారు. ఫిఫా కూడా ఈ ఒరవడికి శ్రీకారం చుట్టాలనుకుంటోంది. అదే జరిగితే.. ఫుట్‌బాల్ ఆటలో ఈ ఉంగరాలు అందుకున్న రికార్డు విజేతలకు సొంతమవ్వనుంది.అమెరికా, మెక్సికో, కెనడాలు సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న ఫిఫా వరల్డ్‌కప్ 2026 విజేతలకు జీవితాంతం గుర్తుండిపోయే కానుక లభించనుంది. న్యూయార్క్‌లోని న్యూ జెర్సీ స్టేడియంలో జూలై 19, ఆదివారం జరుగునున్న ఫైనల్లో గెలుపొందిన జట్టుకు ట్రోఫీ బహూకరణ, ఆటగాళ్లకు గోల్డ్ మెడల్స్‌తో పాటు.. ఈసారి







ఛాంపియన్‌షిప్ ఉంగరాలు కూడా ఇవ్వనుంది ఫిఫా.

**మొత్తం 2026 ఉంగరాలు**

ఎడిషన్ 2026 కాబట్టి.. మొత్తం 2026 ఉంగరాలు సిద్ధం చేస్తున్నారు. వీటిలో 30 రింగ్స్ విజేతగా నిలిచిన జట్టుకు కాగా.. మిగిలిన 1,996 ఉంగరాలను గుర్తింపు పొందిన సంస్థల ద్వారా అభిమానులకు అమ్మనున్నారు. ఛాంపియన్‌షిప్స్ ఉంగరం ప్రత్యేకంగా ఉండనుంది. దీనికి ఒకవైపు ఫిఫా వరల్డ్‌కప్ ట్రోఫీ ఉంటుంది. రెండోవైపు.. గెలుపొందిన జట్టుకు సంబంధించిన దేశం చిహ్నం ముద్రించి ఉంటుంది.అలానే ప్రతి ఉంగరానికి వ్యక్తిగత నంబర్ ఉంటుంది. అయితే.. ఫైనల్ అనంతరం విన్నింగ్ టీమ్ కెప్టెన్, కోచ్‌కు తాత్కాలిక ఛాంపియన్‌షిప్ రింగ్స్ ప్రదానం చేస్తారు. సంబురాలు ముగిశాక.. ఆటగాళ్లు, సిబ్బంది వేళ్లకు సరిపోయేలా కస్టమైజ్ చేసిన ఉంగరాలను అధికారికంగా ఫిఫా అందజేయనుంది.

# స్పోర్ట్స్

## నాకు ఆర్సీబీనే ముఖ్యం..
## ఇంగ్లండ్‌కు కోచింగ్ ఇవ్వలేను..!




ఇంగ్లండ్ పురుషుల జట్టు టెస్టు కోచ్ రేసు నుంచి ఆండీ ఫ్లవర్ వైదొలిగాడు. బ్రెండన్ మెక్‌కల్లమ్ రాజీనామా అనంతరం తదుపరి కోచ్‌గా తన పేరు పరిశీలనలో ఉందన్న వార్తలు వినిపిస్తుండగానే అతడు స్వచ్ఛందంగా తప్పుకున్నాడు. గతంలో ఇంగ్లండ్‌కు కోచ్‌గా పనిచేసిన అనుభవం ఉన్నప్పటికీ.. మళ్లీ ఆ బాధ్యతలు తీసుకునేందుకు తనకు ఏమాత్రం ఆసక్తి లేదని స్పష్టం చేశాడు ఫ్లవర్.టెస్టు కోచ్‌గా బ్రెండన్ మెక్‌కల్లమ్ రాజీనామాతో పలువురి పేర్లు తెరపైకి వచ్చాయి. రాహుల్ ద్రవిడ్, రవి శాస్త్రి, ఆండీ ఫ్లవర్, జస్టిన్ లాంగర్.. ఇలా వీరింతా రేసులో ఉన్నారనే వార్తలు వైరలయ్యాయి. అయితే.. వీరిలో ఐపీఎల్‌లో కోచ్‌గా రాణిస్తున్న ఫ్లవర్ తనకు ఇంగ్లండ్ హెడ్‌కోచ్ పదవిపై ఆసక్తి లేదని చెప్పేశాడు. శుక్రవారం మీడియాతో మాట్లాడిన ఈ కోచింగ్ దిగ్గజం 'మీరు ఇంగ్లండ్ కోచ్ పదవిని ఆశించడం లేదా?' అనే ప్రశ్నకు 'అవును' అని బదులిచ్చాడు.'ప్రస్తుతం ఐపీఎల్ ఫ్రాంచైజీ ఆర్సీబీకి కోచ్‌గా ఉన్నందున ఇంగ్లండ్ టెస్టు కోచ్‌గా వెళ్లలేను అని ఫ్లవర్ చెప్పేశాడు. ఏకకాలంలో రెండుజట్లకు కోచింగ్ ఇవ్వగలనని నేను అనుకోవడం లేదు. ఇంగ్లండ్‌లో వేసవి పూర్తైన రెండు మూడు నెలలకే ఐపీఎల్ మొదలవ్వనుంది. ఒకవేళ నేను ఇంగ్లండ్ టెస్టు కోచ్ అయితే.. అక్కడే ఉండి ఆటగాళ్లను గమనించాలి. కానీ, ఇదంతా సాధ్యపడనిపిస్తోంది. ఇదే విషయంపై నేను ఇంగ్లండ్ వేల్స్ బోర్డుతో మాట్లాడాను. ప్రస్తుతం నేను ఆర్సీబీ కోచ్‌గా చాలా సంతృప్తిగా ఉన్నాను' అని ఫ్లవర్ వెల్లడించాడు.ఇంగ్లండ్ అసిస్టెంట్ కోచ్‌గా 2007లో సేవలందించిన ఫ్లవర్.. 2009లో ప్రధాన కోచ్‌గా బాధ్యతలు చేపట్టాడు. 2014 వరకూ కోచింగ్ ఇచ్చిన అతడు.. ఆపై ఫ్రాంచైజీ క్రికెట్‌లో అడుగుపెట్టి అద్భుతాలు చేస్తున్నాడు. ఐపీఎల్ ఆరంభ సీజన్ నుంచి టైటిల్ కోసం నిరీక్షిస్తున్న ఆర్సీబీ కలను సాకారం చేసిన ఫ్లవర్.. 19వ సీజన్‌లోనూ బెంగళూరును విజేతగా నిలిపి విజయవంతమైన కోచ్‌గా ప్రశంసలందుకున్నాడు.

స్నేహితుల సర్‌ప్రైజ్‌తో

# సమంత సీమంతం..

కుటుంబ వేడుకలో ఎమోషనల్ మూమెంట్స్ వైరల్!



టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత రూత్ ప్రభు ప్రస్తుతం తన వ్యక్తిగత జీవితంలో హ్యాపీ మూమెంట్స్‌ని ఎంజాయ్ చేస్తుంది. ఇటీవల సమంత తన భర్త, దర్శకుడు రాజ్ నిడిమోరుతో కలిసి ఓ సన్నిహిత కుటుంబ వివాహ వేడుకకు హాజరయ్యారు. పెళ్లి వేడుకకు వెళ్లిన ఈ జంటకు అక్కడ స్నేహితులు, కుటుంబ సభ్యులు కలిసి ప్రత్యేకమైన సర్‌ప్రైజ్ ప్లాన్ చేశారు. సమంత గర్భిణిగా ఉండటంతో ఎలాంటి హడావిడి లేకుండా అక్కడే చిన్నపాటి సీమంతం వేడుక నిర్వహించారు. సంప్రదాయ పద్ధతిలో సమంతకు కొత్త దుస్తులు అందించి, స్వీట్లు తినిపించి ఆశీర్వదించారు. ఈ సర్‌ప్రైజ్‌ను అస్సలు ఊహించని సమంత ఒక్కసారిగా ఎమోషనల్ అయి స్నేహితుల ప్రేమాభిమానాలకు ఆనందం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. రాజ్ నిడిమోరు కూడా ఈ ప్రత్యేక క్షణాలను ఎంతో ఆస్వాదించినట్లు సమాచారం. ఈ వేడుకలో సమంత, రాజ్ నిడిమోరు ఒకే రంగు మెరూన్ సంప్రదాయ దుస్తుల్లో కనిపించి అందరి దృష్టిని ఆకర్షించారు. ప్రెగ్నెన్సీ గ్లోతో మెరిసిపోతున్న సమంత, కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి గడిపిన ఆప్యాయ క్షణాలు సోషల్ మీడియాలో అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. ఈ ఫొటోలు బయటకు రావడంతో అభిమానులు ఈ జంటకు శుభాకాంక్షలు తెలుపుతూ సోషల్ మీడియాలో కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. సమంత జీవితంలో ఇది మరపురాని జ్ఞాపకంగా నిలిచిపోతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. కొద్ది రోజులుగా సమంత గర్భధారణపై వార్తలు వినిపిస్తుండగా, ఇటీవల జరిగిన 'మా ఇంటి బంగారం' విజయోత్సవ కార్యక్రమంలో ఆమె బేబీ బంప్‌తో కనిపించడం చర్చనీయాంశమైంది. ప్రస్తుతం ఆమె షూటింగ్‌లకు విరామం ఇచ్చి కుటుంబంతో కలిసి ఈ ప్రత్యేక సమయాన్ని పూర్తిగా ఆస్వాదిస్తోంది. నటిగా వరుస విజయాలతో కెరీర్‌లో కొత్త అధ్యాయం ప్రారంభించిన సమంతకు, ఇప్పుడు వ్యక్తిగత జీవితంలోనూ కొత్త ఆనందం చేరువైంది. కుటుంబ సభ్యులు, స్నేహితుల మధ్య జరిగిన ఈ సీమంతం వేడుక ఆమె జీవితంలో మరపురాని అనుభూతిగా నిలిచిపోనుంది. అభిమానులు కూడా తల్లి కాబోతున్న సమంతకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆమె ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటున్నారు.

# అజిత్ సినిమా కీలక పాత్రలో కయాదు లోహర్ ?



అనతికాలంలోనే తారపథంలో దూసుకుపోతున్నది అస్సామీ సోయగం కయాదు లోహర్. డ్రాగన్, ఫంకీ చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు చేరువైన ఈ భామ ప్రస్తుతం 'ది ప్యారడైజ్'లో నాని సరసన కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. తాజా సమాచారం ప్రకారం ఆమె తమిళంలో మరో బంపరాఫర్‌ను దక్కించుకున్నట్లు తెలిసింది. వివరాల్లోకి వెళితే.. అగ్ర హీరో అజిత్ 64వ సినిమా కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయి. దీనికి అధిక్ రవిచంద్రన్ దర్శకత్వం వహిస్తారు. ప్రస్తుతం ఈ సినిమా ప్రీప్రొడక్షన్ దశలో ఉంది. ఈ సినిమాలోని ఓ కీలక పాత్రలో కయాదు లోహర్ నటించనున్నట్లు తెలిసింది. కథాగమనంలో ఆమె పాత్రకు చాలా ప్రాధాన్యత ఉంటుందని చెబుతున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో వెలువడనుంది. ఇదిలావుండగా సూర్య 48వ చిత్రంలో కూడా కయాదులోహర్ నాయికగా నటిస్తున్నది.



# క్వాలిటీ కథలకే ఓటేసిన కృతి సనన్..

కెరీర్ మొదలుపెట్టి పుష్కరం దాటిపోయింది. కావాల్సినంత డబ్బులు, రావాల్సినంత పేరు వచ్చేసాయి.. అయినా కూడా ఇప్పటికీ పిచ్చి పిచ్చి సినిమాలెందుకు చేయడం అంటున్నారు ఓ హీరోయిన్. వయసైపోతోందని ఏది పడితే అది చేయకుండా.. కెరీర్‌పై ఫుల్ ఫోకస్ పెడుతున్నారు. క్వాంటిటీ కాదు క్వాలిటీయే ముఖ్యం అంటున్నారామె. మరి ఇంతకీ ఎవరా ముద్దుగుమ్మ..? పుష్కరం కింద నేనొక్కడినేతో తెలుగు ఇండస్ట్రీకి పరిచయమైన బ్యూటీ కృతి సనన్.. ఆ తర్వాత హిందీలో టాప్ హీరోయిన్‌గా మారిపోయారు. అప్పట్లో ఖాళీగా ఉండకూడదని ఏ ఛాన్స్ వస్తే అది చేసుకుంటూ వెళ్లిన ఈ భామ.. ఇప్పుడు మాత్రం కథ నచ్చితేనే డేట్స్ ఇస్తానంటూ గట్టిగా చెబుతున్నారు. బాలీవుడ్‌లో తనకంటూ ఒక స్పెషల్ క్రేజ్ సొంతం చేసుకుని కాన్ఫిడెంట్‌గా దూసుకుపోతున్నారీమె. వచ్చిన ప్రతి సినిమాను ఓకే చేసే రోజులకి గుడ్‌బై చెప్పేసిన ఈ బ్యూటీ.. ఇప్పుడు రూట్ మార్చి క్వాలిటీకే ఓటేస్తోంది. తనకు నిజంగా కిక్ ఇచ్చే కథలనే ఎంచుకుంటూ.. రిజల్ట్ గురించి టెన్షన్ పడకుండా బిందాస్‌గా అడుగులు వేస్తున్నారు. ప్రస్తుతం తన కెరీర్, లైఫ్‌లో ఎక్సైటింగ్ ఫేజ్ నడుస్తోందని తెలిపారీమే. ఇక్కడి దాకా వచ్చినందుకు ఎంతో హ్యాపీగా ఉందని ఫుల్ జోష్‌లో చెప్తున్నారు కృతి. పర్సనల్ లైఫ్‌లోనూ కృతిసనన్ తీసుకున్న ఓ నిర్ణయం హాట్ టాపిక్‌గా మారిందిప్పుడు. వయసైపోతుందేమో, త్వరగా పెళ్లి చేసుకోవాలేమో అనే టెన్షన్ లేకుండా.. కెరీర్‌పై ఫోకస్ చేయడానికే ఎగ్స్ ఫ్రీజ్ చేయించుకున్నట్లు ఓపెన్‌గా చెప్పారు. ఏ ప్రెషర్ లేకుండా ఫుల్ ఫ్రీడమ్‌తో కెరీర్‌ను ఎంజాయ్ చేస్తున్నారీమే. మొత్తానికి ఈ టైమ్‌లో తనకు క్వాంటిటీ కాదు కథల్లో క్వాలిటీ కావాలంటున్నారు కృతి.

NBK111'


# రిలీజ్ డేట్ ఫిక్స్?

పభాస్ 'ఫౌజీ'తో క్లాష్ తప్పించుకునే ప్లాన్‌లో బాలయ్య టీమ్!



గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ, మాస్ చిత్రాల స్పెషలిస్ట్ గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ చీదీఖ111 పై రోజురోజుకీ అంచనాలు పెరుగుతున్నాయి. ఇటీవల విడుదలైన ఫస్ట్ లుక్, గ్లింప్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకోవడంతో సినిమాపై భారీ హైప్ ఏర్పడింది. ముఖ్యంగా బాలయ్య స్టైలిష్ మాస్ లుక్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారి అభిమానుల్లో మరింత ఉత్సాహాన్ని నింపింది. ఈ చిత్రంలో బాలకృష్ణను ఇప్పటివరకు చూడని కొత్త స్టైలిష్ అవతారంలో గోపీచంద్ మలినేని చూపించబోతున్నారని గ్లింప్స్ ద్వారానే స్పష్టమైంది. పవర్‌ఫుల్ యాక్షన్‌తో పాటు స్టైలిష్ ప్రెజెంటేషన్‌కు ప్రాధాన్యం ఇస్తూ సినిమాను రూపొందిస్తున్నారని సినీ వర్గాలు చెబుతున్నాయి. దీంతో ఈ సినిమా కోసం బాలయ్య అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇదిలా ఉంటే, ఇప్పుడు 'చీదీఖ111' విడుదల తేదీ గురించిన చర్చ ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రాన్ని డిసెంబర్ 25 క్రిస్మస్ సందర్భంగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని నిర్మాతలు ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. వాస్తవానికి ఈ సినిమాను డిసెంబర్ తొలి వారంలోనే విడుదల చేయాలనే ఆలోచన ఉన్నప్పటికీ, పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న భారీ చిత్రం 'ఫౌజీ' డిసెంబర్ 3న విడుదల కానుందని అధికారికంగా ప్రకటించడంతో మేకర్స్ తమ వ్యూహాన్ని మార్చుకున్నట్లు సమాచారం. ప్రభాస్ సినిమాతో పోటీ పడకుండా, క్రిస్మస్ హాలిడే సీజన్‌ను లక్ష్యంగా చేసుకుని డిసెంబర్ చివరి వారంలో విడుదల చేస్తే కలెక్షన్లకు మరింత అనుకూలంగా ఉంటుందని చిత్రబృందం భావిస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది. క్రిస్మస్ సెలవులు, అనంతరం న్యూ ఇయర్ హాలిడేస్ కలిసి రావడం వల్ల సినిమాకు లాంగ్ రన్ దక్కే అవకాశాలు కూడా ఎక్కువగా ఉంటాయని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ భారీ చిత్రంలో బాలకృష్ణ మరోసారి తన మాస్ పవర్‌ను చూపించేందుకు సిద్ధమవుతున్నారు. గోపీచంద్ మలినేని మార్క్ యాక్షన్, బాలయ్య స్క్రీన్ ప్రెజెన్స్, హై వోల్టేజ్ ఎలివేషన్ సీన్స్ ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. అయితే డిసెంబర్ 25 విడుదల తేదీపై చిత్రబృందం నుంచి ఇంకా అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. రిలీజ్ డేట్ ఖరారైతే, ఈ క్రిస్మస్ సీజన్‌లో బాలయ్య అభిమానులకు మరో భారీ సినీ పండుగ ఖాయమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# గుండెజబ్బులు ఉన్నవాళ్లు సినిమాకు రావద్దు!



ఎస్‌బీకే ఫిలిం కార్పొరేషన్ బ్యానర్‌పై, రేగుల నీరజరాణి సమర్పణలో, ఆర్‌ఎన్‌ఆర్ డిస్ట్రిబ్యూషన్ అండ్ ప్రొడక్షన్ ఆధ్వర్యంలో దర్శకుడు, నిర్మాత ఎస్కే బషీద్ తెరకెక్కించిన హారర్ సస్పెన్స్ థ్రిల్లర్ 'అమెన్'. ఈ చిత్రం జూలై 24న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ సినిమా గురించి ఎస్కే బషీద్ మాట్లాడు తూ "ఇప్పటివరకు వచ్చిన హారర్ సినిమాల ట్రెండ్‌ను పూర్తిగా మార్చేలా 'అమెన్' రూ పొందించాం. సరికొత్త సస్పెన్స్, భయానక ఎలిమెంట్స్‌తో ప్రేక్షకులను థ్రిల్ చేయబోతు న్నాం. ఈ సినిమా ఎంత భయపెడుతుందో చెప్పలేం... గుండె జబ్బులు ఉన్నవాళ్లు థి యేటర్‌కు రావద్దు. ఒంటరిగా కూర్చుని చూసే ధైర్యం ఎవరికీ ఉండదు. ఇది కుటుంబ సమేతంగా థియేటర్లలో ఆస్వాదించాల్సిన ఒక భయానక చిత్రం"అని అన్నారు.

Printed, Published and Owned by SITARALLA SRIRAMULU and Printed at M/s SRI DIVYA PRINTERS, Plot No. 33 & 34, 2nd Floor, Vasthu Colony, LB Nagar, Ranga Reddy, Telangana - 500074 and Published at H.No. 10-1-101/10. Bhagya Nagar Colony, Lingojiguda, Saroornagar, Ranga Reddy, Telangana - 500035. EDITOR: SITARALLA SRIRAMULU , RNI. No. TELTEL/2015/62524. Cell: 9966443465